

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 48 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 18, జనవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# మెరిసిపోతున్న మేడారం.. మురిసిపోతున్న భక్తులు





క్యాబినెట్ సమావేశంతో చరిత్ర సృష్టించబోతున్న మేడారం

వనదేవతల దర్శనానికి బారులు తీరుతున్న కోట్లాది జనం

యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టిన మహిళా మంత్రులు

వందల కోట్ల నిధులు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

భక్తకోటి జనానికి ఎలాంటి భయం లేకుండా సర్వం ఏర్పాట్లు

పోలీస్ పహారాలో శాంతిభద్రతల నిర్మాణం

రికార్డు స్థాయిలో భక్తుల రాకకు పూర్తి ఏర్పాట్లు

దేశం మొత్తం ఒక్కసారిగా మేడారంను తపిస్తుంది

ఆసియా ఖండంలోని అతిపెద్ద అరుదైన పండుగ

గుడి ఆవరణంలో వనదేవతల చరిత్రకు నూతన నిర్మాణం

డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

భక్తకోటి జనాలకు వనదేవతల దర్శనమిచ్చే సమయం ఆసన్నమైనదని డాక్టర్ బరిగెల శివ అభిప్రాయం వ్యక్తం చేశారు.కాకతీయుల కాలం నాటి చరిత్రను మరొక్కసారి జ్ఞాపకం చేసుకోక తప్పదు అన్నారు.భక్తుల మనోభావాలను ఉన్నతమైన పై స్థాయికి పెంపొందించబడే విధంగా మేడారం జాతర ఏర్పాట్లు పూర్తి చేయబడ్డాయన్నారు. వనదేవతలను సరైన పద్ధతిలో క్రమశిక్షణ రూపంలో దర్శనం చేసుకొనుటకు సర్వం ఏర్పాట్లు చేసిన మేడారం ధర్మకర్తలను అభినందించాలన్నారు.మంత్రి కొండా సురేఖ మంత్రి సీతక్కలు అనునిత్యం మేడారం పనులను పర్యవేక్షిస్తూ సకాలంలో పనులను పూర్తవుటకు నిత్య శ్రామికుల వలె పనిచేసిన విధానం నా భూతో నా భవిష్యత్తు అన్నారు.తన చిరకాల కోరికను నెరవేర్చుకున్న మంత్రి సీతక్క భావోద్వేగానికి లోనుకాబోతున్న సందర్భం ఆసన్నమైందన్నారు.మంత్రి పదవిలో మేడారం జరపాలని తన చిరకాల కోరికను నెరవేర్చుకుంటున్న సందర్భంలో మరోచరిత్ర నిర్మించబోతున్నారన్నారు. తెలంగాణ

- మిగతా 2లో..



## ఇన్‌ఫ్లుయెన్సర్ల 'లక్కీ డ్రా' ప్రకటనలు.. హెచ్చరించిన సజ్జనార్

లక్కీడ్రా ఇన్‌ఫ్లుయెన్సర్ల పట్ల జాగ్రత్త ఉండాలని ప్రజలకు సూచన

బెట్టింగ్ యాప్‌ల దందా ఆగిపోవడంతో లక్కీడ్రా అంటూ వేషాలు వేస్తున్నారని ఆగ్రహం

చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించిన సజ్జనార్



3

## రోహిత్ వేముల చట్టం ఒక ప్రకటన కాదు, అది ఒక అవసరం: రాహుల్ గాంధీ

రోహిత్ వేముల కుల వివక్షకు గురై నేటితో 10 సంవత్సరాలు



6

## చైనా 'కృత్రిమ సూర్యుడు' ప్రపంచానికి వణుకు! భౌతిక శాస్త్ర సూత్రాలే మారిపోనున్నాయా?

7

## మహారాష్ట్రలో మా విజయం ప్రజల విశ్వాసానికి నిదర్శనం: ఒవైసీ

మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో 125 మంది ఎంఐఎం కార్పొరేటర్ల విజయం

ఎంఐఎం విజయంపై ఒవైసీ హర్షం

ఓడిపోయిన పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు



2



## ఆదిలాబాద్ అభివృద్ధికి సమగ్ర బ్లూప్రింట్

బాసరలో యూనివర్సిటీ, నిర్మల్‌లో ఏటీసీ, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు

సీఎం రేవంత్ రెడ్డి

ఆదిలాబాద్, 17 జనవరి 2026(జై భీమ్ న్యూస్)

తెలంగాణలో అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉన్న ఆదిలాబాద్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమగ్ర అభివృద్ధి ప్రణాళికను ప్రకటించారు. బాసర ఐఐఐటీలో విశ్వవిద్యాలయం ఏర్పాటు, నిర్మల్‌లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ), ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తాగుసాగునీటి అవసరాల కోసం తుమ్మిడిహెట్టి వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం, అలాగే జిల్లాలో అతిపెద్ద పారిశ్రామిక వాడ అభివృద్ధి వంటి కీలక నిర్ణయాలను సీఎం వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ. 386.46 కోట్లతో

- మిగతా 2లో..

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# ఆదిలాబాద్ అభివృద్ధికి సమగ్ర బ్లూప్రింట్

మొదటి పేజీ తరువాయి

చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మల్ పట్టణంలో నిర్వహించిన "ప్రజా పాలన ప్రగతి బాట" బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రాంతంలో ఆదిలాబాద్‌కు రావాల్సినంత అభివృద్ధి, నీరు గతంలో రాలేదని పేర్కొన్న సీఎం, పాలమూరు జిల్లాకు ఇచ్చిన ప్రాధాన్యతే ఆదిలాబాద్‌కూ ఇస్తామని స్పష్టం చేశారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న చనాకకొరాట ప్రాజెక్టును ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి చేశామని గుర్తు చేశారు. చనాకకొరాట బ్యారేజీకి మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి పేరును, సదర్మట్ బ్యారేజీకి స్వతంత్ర సమరయోధుడు, మాజీ మంత్రి పి. నర్సారెడ్డి పేరును పెట్టాలని నిర్ణయించినట్లు సీఎం ప్రకటించారు. ఈ అంశంపై నీటిపారుదల శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్మల్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని, అలాగే సరస్వతీ ఆలయం ఉన్న బాసర ఐఐఐటీలోనే విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. యూనివర్సిటీ ఎక్కడ ఏర్పాటు చేయాలన్న చర్చలతో కాలం వృథా చేయకుండా బాసరలోనే ప్రారంభిస్తామని, ఇందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లాలో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడను అభివృద్ధి చేసి, దేశంలోని ప్రధాన పరిశ్రమలను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటామని సీఎం వెల్లడించారు. ఇందుకోసం 10 వేల ఎకరాల భూమి సేకరణ చేపడతామని తెలిపారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమని, ఇప్పుడు ఓట్లేసి గెలిపించిన ప్రజల కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎర్రబస్సు కూడా రాని పరిస్థితి నుంచి ఎయిర్ బస్సు వచ్చే స్థాయికి ఆదిలాబాద్‌ను తీసుకెళ్లాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. రాష్ట్రానికి సంబంధించిన అనుమతులు, నిధుల కోసం ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను ఎలా కలుస్తున్నామో, అదే తరహాలో రాష్ట్ర అభివృద్ధి పనుల కోసం ప్రజాప్రతినిధులు కూడా కలిసి రావాలని సీఎం కోరారు. ఫిబ్రవరి తొలి వారంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో ఒక రోజు, మరుసటి రోజు అధికార యంత్రాంగంతో జిల్లా ఇంచార్జ్ మంత్రి సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలని సూచించారు. ఆ నివేదిక ఆధారంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించి బడ్జెట్ సమావేశాల్లో అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద గతంలో ప్రతిపాదిత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును తప్పనిసరిగా నిర్మించి తీరుతామని సీఎం స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్ సిద్ధమవుతోందని, మహారాష్ట్ర నుంచి తీసుకోవాల్సిన అనుమతుల విషయంలో కేంద్రం సహకారం అవసరమని చెప్పారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తామని వెల్లడించారు. నాగోబా జాతర అభివృద్ధికి రూ.22 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే దాదాపు రూ.300 కోట్లతో మేడారం సమ్మక్కసారలమ్మ మందిరాన్ని కుంభమేళా స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మన భవిష్యత్ తరాల కోసం ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, మేం పాలకులం కాదని, ప్రజల సేవకులమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్తో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మహారాష్ట్రలో మా విజయం ప్రజల విశ్వాసానికి నిదర్శనం: ఒవైసీ

**మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో 125 మంది ఎంఐఎం కార్పొరేటర్ల విజయం**

**ఎంఐఎం విజయంపై ఒవైసీ హర్షం**

**ఓడిపోయిన పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు**

**మహారాష్ట్ర, జై భీమ్ న్యూస్**

మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ సంచలన విజయాలను నమోదు చేసింది. ఔరంగాబాద్, ముంబై, నాగ్‌పూర్ వంటి కీలక నగరాల్లో పార్టీ తన ఉనికిని బలంగా చాటుతూ, మొత్తం 125 మంది కార్పొరేటర్లను గెలిపించుకుంది. ఈ విజయంపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ హర్షం వ్యక్తం చేశారు. తమ అభ్యర్థులను గెలిపించినందుకు మహారాష్ట్ర ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని ప్రతిపక్షాలకు హితవు పలికారు. మహారాష్ట్రలో తమ పార్టీకి వచ్చిన విజయం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. ఓటమి ఎదుర్కొన్న పార్టీలు తమను నిందించకుండా తమ వైఫల్యాలపై ఆలోచించాలని హితవు పలికారు. పార్టీ గుర్తుపై గెలిచిన అభ్యర్థులు పార్టీతోనే ఉంటారని విశ్వాసం వ్యక్తం చేసిన ఓవైసీ, తమ కార్పొరేటర్లను ఏకతాటిపై ఉంచేందుకు అన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎంఐఎం సిద్ధమవుతోందని, ఆసక్తి ఉన్న అభ్యర్థుల పేర్లను పార్టీ ఇప్పటికే కోరిందని తెలిపారు.

## నల్గొండ ఇక కార్పొరేషన్...

**సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన మంత్రి కోమటిరెడ్డి**

**నల్గొండకు మున్సిపల్ కార్పొరేషన్ హోదా**

**కార్పొరేషన్ హోదాతో నేరుగా కేంద్ర నిధులు పొందే అవకాశం**

**సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామన్న మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్ తరహాలో నల్గొండను తీర్చిదిద్దుతామని వెల్లడి**

**రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలని పిలుపు**

**నల్గొండ, జై భీమ్ న్యూస్**

నల్గొండ పట్టణానికి మున్సిపల్ కార్పొరేషన్ హోదా లభించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నల్గొండను కార్పొరేషన్‌గా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో నల్గొండను ఒక 'సూపర్ స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. కార్పొరేషన్ హోదా రావడంతో ఇకపై అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు పొందే అవకాశం కలిగిందని మంత్రి కోమటిరెడ్డి వివరించారు. కేవలం 25 నెలల్లోనే ఈ హోదాను సాధించామని, దీనివల్ల గతంతో పోలిస్తే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో చేపట్టనున్న అభివృద్ధి ప్రణాళికలను కూడా ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్‌తో పాటు రూ.700 కోట్లతో ఓఆర్ఆర్, ధర్వేశిపురం వరకు 6 లైన్ల రహదారి నిర్మిస్తామని తెలిపారు. అలాగే, ఏఎంఆర్‌పీ కాలువల లైనింగ్ కోసం రూ.450 కోట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మంగారి గుట్ట – లతీఫ్ సాబ్ దర్గా గుట్టలను కూడా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా నల్గొండను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్పొరేషన్ అభివృద్ధికి శాంతి, సామరస్యాలతో అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# మెరిసిపోతున్న మేడారం మురిసిపోతున్న భక్తులు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రం ఏర్పడ్డాక మొట్టమొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా క్యాబినెట్ సమావేశాలను మేడారంలో రెండు రోజులపాటు జరుపుతుండడం అత్యంత గౌరవమన్నారు.రికార్డ్ స్థాయిలో భక్తుల రాకకు పూర్తి ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు.ఎన్నడూ లేని విధంగా రోడ్లన్నీ శుద్ధి చేశారని,మరమ్మత్తులు చేశారని ఎక్కడ తగ్గని ఏర్పాట్ల కోసం కావలసిన నిధులన్నీ మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి మహిళా మంత్రులతో పాటు ఆదివాసులు,భక్తకోటి జనం విశ్వాసులు రుణపడి ఉంటున్నారన్నారు.దేశం మొత్తం ఒక్కసారిగా మేడారం జాతరను తపిస్తుండగా ఆదివాసుల ,గిరిజనుల ఆత్మగౌరవం ఆకాశానికి చేరిపోతుందన్నారు.ఆరు నెలలుగా నిర్విరామం లేకుండా పనులు చేపడుతున్న మహిళా మంత్రులు పోలీస్ పహారాలు శాంతిభద్రతల ఏర్పాట్లపై ప్రత్యేకమైన శ్రద్ధను కనపరుస్తున్నారన్నారు.మేడారం జాతరను ఎన్నడు లేనివిధంగా సుందరీ కరణగా తీర్చిదిద్దడం వెనకాల ప్రభుత్వం, మహిళా మంత్రులు పూర్తి శ్రద్ధ వహించారన్నారు.

**మేడారం చరిత్ర తిరగరాయలేనిది..**

వనదేవతలుగా కొనియాడబడుతున్న సమ్మక్క సారలమ్మలు ఆదివాసుల గిరిజనుల ఆత్మగౌరవానికి సంబంధించిన దేవతలుగా అంచలంచలుగా కొనియాడ పడుతూ కోట్ల మంది భక్తులను సంపాదించుకోగలిగారన్నారు.కాకతీయుల సామ్రాజ్యంలో మేడరాజు సామంత రాజుగా కొనసాగుతున్న సందర్భంలో ఆదివాసుల ప్రాంతాలను కాకతీయులు పాలిస్తుండగా.కష్టకాలంలో ఐదు సంవత్సరాల పాటు ఒక్కసారిగా కరువు ఏర్పడడం ఆదివాసులు గిరిజనులు కాకతీయుల రాజులకు కప్పం కట్టలేక గడ్డుకాలాన్ని అనుభవిస్తున్న సందర్భంలో మొదటి ప్రతాపరుద్రుని కాలంలో పన్నులు కట్టాల్సిందేనంటూ ఆదివాసులపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తూ చివరకు ఆదివాసుల సామ్రాజ్యాన్ని గిరిజనుల సామ్రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవడం కోసం దండయాత్రను కొనసాగించిన కాకతీయులు ఒక్కసారిగా ఆదివాసుల సామ్రాజ్యాన్ని శాసిస్తూ యుద్ధాన్ని ప్రకటించగా యుద్ధంలో కుటుంబ సమేతంగా సామూహిక పోరాటం చేస్తూ తిరుగుబాటు యుద్ధం చేసిన వనదేవతలు ఆదివాసుల ప్రాంతాన్ని గిరిజనుల ప్రాంతాన్ని కాకతీయుల రాజుల చేతిలో నుండి కాపాడుకోవడం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడినారన్నారు.యుద్ధంలో వెన్నుపోటు దారులుగా నిలిచిన కాకతీయుల రాజులు సమ్మకను వెనుక నుండి వీపుపై కత్తిపోటు పొడవడంతో వీర పోరాటం చేస్తూనే చిలకలగుట్ట వైపు పరిగెత్తుకొని వెళ్లడం తదుపరి ఆదివాసులు సమ్మక్క కోసం వెతుకుతుండగా చిలకలగుట్ట ప్రాంతంలో కుంకుమ భరణి లభించగా దానికి ఆనవాయితీగా ఆదర్శంగా నాగశుద్ధ పౌర్ణమి దినాన ఆదివాసులు సమ్మక్కను పూజించడం మొదలుపెట్టారన్నారు.ప్రతి రెండు సంవత్సరాలకు ఘనంగా జరుపుకునే మేడారం జాతరలో సమ్మక్క భర్తయైనా పైడిద్దరాజు ఆదివాసుల సామ్రాజ్యాన్ని రక్షించుకోవడం కోసం కాకతీయుల చేతిలో వీరమరణం పొందాడన్నారు.కుమార్తె సారలమ్మ వీరమరణం పొందగా కుమారుడు జంపన్న కాకతీయుల చేతిలో పూర్తిగా గాయపడ్డప్పటికిని వాళ్లతో జరుగుతున్న యుద్ధంలో మరణించడం ఇష్టం లేక జంపన్న వాగులో దూకి ప్రాణాలు విడిచారన్నారు.దాని జ్ఞాపకంగా జంపన్న వాగులో భక్తులందరూ స్నానాలు చేసి దర్శనాలు చేసుకోవడం నిత్య పూజలో భాగంగా కొనసాగుతుందన్నారు.పసుపు కుంకుమ కలిపిన బాంధారిని ఆదివాసులు నీళ్లల్లో కలుపుకుంటూ పంటలపై విత్తనాలపై ఇండ్లపై దాన్యంపై చల్లుకోవడం వల్ల పంట దిగుబడితో పాటు వాళ్ల ప్రాంతాలకు రక్షణ లభిస్తుందని భావిస్తుంటారు అన్నారు.ఆసియా ఖండంలోనే అతి పెద్ద పండుగగా కొనసాగుతున్న మేడారం జాతరకు ఎప్పుడు లేని కొత్తదనాన్ని తీసుకొచ్చే విధంగా ఆదివాసుల మూలాలైన గిరిజనుల మూలాలైన మూడు నుండి ఏడు గోత్రాల చరిత్రలను రాతి పలకలపై చెక్కించి భక్తులు వీక్షించే విధంగా దర్శనాల కోసం ఏర్పాటు చేయడం ఆదివాసుల చరిత్రను పెంచే విధంగా ఉందన్నారు.తను బ్రతికున్నప్పుడే మహిమలతో కూడిన నాటు వైద్యం మూలికల వైద్యం చేస్తూ ఎంతో ప్రావీణ్యురాలుగా ఆదివాసుల ప్రాణాలను కాపాడిన సమ్మక్కను మొదటి రోజు దర్శనం చేసుకునే విధంగా పూర్తి ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు.కాకతీయుల చేతిలో నుండి ఆదివాసుల గిరిజనుల సామ్రాజ్యాన్ని కాపాడుకోవడం కోసం వీరమరణం పొందిన సారక్కను రెండవ రోజు పూజించుకోవడం కోసం దర్శన ఏర్పాట్లు చేయబడ్డాయన్నారు.మూడవరోజుగా కుటుంబ సమేతంగా సమ్మక్క సారలమ్మ పైడిద్దరాజు,జంపన్న,సమ్మక్క తండ్రి గోవిందరాజు లను దర్శించుకొనుటకు పూర్తి ఏర్పాట్లు జరిగాయన్నారు.నాలుగో రోజు భక్తులు తిరుగు ప్రయాణంతోపాటు దేవతలు అడవికి మళ్ళించబడడం మేడారం ప్రత్యేకతగా నిరంతరం సాగుతుందన్నారు.అడవి సంస్కృతిని అడవి ప్రకృతిని అడవి సాంప్రదాయాలను క్షేత్రస్థాయిలో కాపాడడమే కాకుండా కాకతీయ రాజులు ఆదివాసుల సామ్రాజ్యాలను గిరిజనుల సామ్రాజ్యాలను బలవంతంగా లాక్కోవడం కోసం జరిపిన దండయాత్రలో కాకతీయుల మీద తిరుగుబాటు యుద్ధం చేసి తమ తమ ప్రాంతాలను కాపాడుకున్న సమ్మక్క సారలమ్మలు వనదేవతల రూపంలో మొదటగా ఆయా ప్రాంతాలకు దేవతలుగా మారిపోయి వేలాది లక్షలాది మందితో భక్తి పూజలు జరిపించుకునే స్థాయికి ఎదగగా మేడారం ప్రతిష్టాత్మకతను తెలుసుకుంటున్న లక్షలాదిమంది కోట్లాదిమంది భక్తులు వాళ్లకు జరుగుతున్న మంచిని లాభాలను గుర్తెరిగి చరిత్ర స్థాయిలో కోట్లకు మించి భక్తులు తయారవడం మేడారం జాతరకు ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు.

## ప్రపంచ క్లీన్ ఎనర్జీలో ఏపీకి అగ్రస్థానం: సీఎం చంద్రబాబు

**కాకినాడలో ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు పనులు ప్రారంభం**

**ఏపీని దేశపు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మార్చడమే లక్ష్యమన్న సీఎం**

**ఇది రూ.83,000 కోట్లతో చేపడుతున్న సమీకృత ప్రాజెక్టు అని వెల్లడి**

**ఇక్కడి గ్రీన్ అమ్మోనియాను జర్మనీ, ఇతర దేశాలకు ఎగుమతి చేయనున్నారు**

**ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగంలో ఏపీ అగ్రస్థానంలో నిలుస్తుందన్న చంద్రబాబు**

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా, నికర హరిత ఇంధన ఎగుమతి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా మరో చరిత్రాత్మక ముందడుగు పడిందని ఆయన ప్రకటించారు. కాకినాడలో ఏఎం గ్రీన్ సంస్థ ఏర్పాటు చేస్తున్న 1.5 మిలియన్ టన్నుల సామర్థ్యం గల గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు పరికరాల ఏర్పాటు కార్యక్రమం శనివారం ప్రారంభమైందని తెలిపారు. ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నామని ముఖ్యమంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు. 2024 అక్టోబర్‌లో తమ ప్రభుత్వం ప్రారంభించిన సమీకృత క్లీన్ ఎనర్జీ పాలసీ ఫలాలను ఇస్తోందని, ఆనాడు తామిచ్చిన హామీకి అనుగుణంగా ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడం గర్వకారణమైన మైలురాయి అని చంద్రబాబు అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా 10 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 83,000 కోట్లు) సమీకృత పెట్టుబడి వస్తోందని వివరించారు. ఈ పెట్టుబడిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనే 7.5 గిగావాట్ల సౌర, పవన విద్యుత్ సామర్థ్యం, 1 గిగావాట్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్లాంట్లు కూడా ఏర్పాటవుతాయని తెలిపారు. ఇది రాష్ట్రంలో ఉన్న సమగ్రమైన క్లీన్ ఎనర్జీ వ్యవస్థకు నిదర్శనమని అన్నారు. ప్రపంచంలోనే ఈ తరహా ప్రాజెక్టు ఇదే మొదటిదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



కాకినాడలో ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమ్మోనియాను జర్మనీతో పాటు ఇతర ప్రపంచ దేశాల మార్కెట్లకు ఎగుమతి చేస్తారని వెల్లడించారు. దీనికి ఆంధ్రప్రదేశ్ వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుతో ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానపరమైన మద్దతు, పారిశ్రామిక అనుకూల వాతావరణం వల్లే ఇలాంటి చరిత్రాత్మక ప్రాజెక్టులు రాష్ట్రానికి తరలివస్తున్నాయని చంద్రబాబు తన ప్రకటనలో వివరించారు.

## వర్ధన్నపేటలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటుకు చర్యలు





**పాత మున్సిపాలిటీ భవనాన్ని పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఎమ్మెల్యే**

**వర్ధన్నపేట, జై భీమ్ న్యూస్**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలో ప్రభుత్వం మంజూరు చేసిన మున్సిఫ్ కోర్టును తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో, పాత మున్సిపాలిటీ భవనాన్ని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు కూడా పాల్గొన్నారు. ఈ భవనంలో తాత్కాలికంగా మున్సిఫ్ కోర్టు ఏర్పాటు చేసే దిశగా అవసరమైన మౌలిక సదుపాయాలు, భవన స్థితిగతులు, న్యాయపరమైన అవసరాలపై అధికారులు, న్యాయవాదులతో కలిసి సమీక్షించారు. కోర్టు ఏర్పాటుతో వర్ధన్నపేటతో పాటు పరిసర మండలాల ప్రజలకు న్యాయ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని వారు పేర్కొన్నారు. ఈ పరిశీలనలో సీనియర్ న్యాయవాది, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్, జాయింట్ సెక్రటరీ ముసిపెట్ల శ్రీధర్ గౌడ్, న్యాయవాది బండారి విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. స్థానికంగా మున్సిఫ్ కోర్టు ఏర్పాటుతో ప్రజలకు వేగవంతమైన న్యాయం అందడమే కాకుండా, ప్రయాణ వ్యయం, సమయం తగ్గుతుందని న్యాయవాదులు అభిప్రాయపడ్డారు.

# రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అప్పీలేట్ అథారిటీ సభ్యుడిగా ఆచార్య గాదె దయాకర్ ఘనంగా సన్మానించిన కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల అధ్యాపక బృందం



**వరంగల్, 17 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అప్పీలేట్ అథారిటీ సభ్యుడిగా నియమితులైన ఆచార్య గాదె దయాకర్ను కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సన్మానించింది. సభ్యుడిగా నియామకానంతరం తొలిసారిగా ఫార్మసీ కళాశాలను సందర్శించిన సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ ఫార్మసీ డీన్ ఆచార్య సమ్మయ్య, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జనపరెడ్డి కృష్ణవేణిలతో పాటు అధ్యాపకులు ఆచార్య నర్సింహారెడ్డి, ఆచార్య షాయద్, ఆచార్య నాగరాజు, ఆచార్య ప్రసాదు తదితరులు పాల్గొని దయాకర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పుష్పగుచ్ఛాలు, శాలువాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీన్ ఆచార్య సమ్మయ్య మాట్లాడుతూ, కాకతీయ యూనివర్సిటీ నుంచి ఆచార్య గాదె దయాకర్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అప్పీలేట్ అథారిటీ సభ్యుడిగా నియమితులవడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పేర్కొన్నారు. సుదీర్ఘ అకడమిక్ అనుభవం, పరిపాలనా నైపుణ్యం కలిగిన వ్యక్తి ఈ బాధ్యతను చేపట్టడం రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి పరిశ్రమలు నిబంధనలు ఉల్లంఘించినప్పుడు చర్యలు తీసుకునే అధికారం ఉందని, ఆ నిర్ణయాలపై అభ్యంతరాలుంటే అప్పీలేట్ అథారిటీని ఆశ్రయించే అవకాశం ఉంటుందని అధ్యాపకులు వివరించారు. అప్పీలేట్ అథారిటీ చైర్మన్‌గా జస్టిస్ సాంబశివరావు నాయుడు నియమితులుకాగా, సభ్యుడిగా ఆచార్య గాదె దయాకర్ బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు. వరంగల్ ధర్మారం గ్రామంలో జన్మించి, హనుమకొండలో స్థిరపడ్డ ఆచార్య గాదె దయాకర్, కాకతీయ యూనివర్సిటీలో సుదీర్ఘకాలం ప్రొఫెసర్‌గా సేవలందించారు. కెమిస్ట్రీ విభాగాధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, యూనివర్సిటీ డెవలప్మెంట్ ఆఫీసర్‌గా, అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారు. అలాగే కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. సన్మాన కార్యక్రమంలో ఆచార్య గాదె దయాకర్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా న్యాయం, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఘనసన్మాన కార్యక్రమంలో డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ సుజాత, డాక్టర్ ఉషాకిరణ్ మై, డాక్టర్ సుకన్య తదితర అధ్యాపకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేపట్టాలి

**నెమురుగొమ్ముల రవి, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్**



**హన్మకొండ, 17 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

రాబోయే గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ నెమురుగొమ్ముల రవి ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించి స్పష్టమైన సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవం జాతీయ గర్వానికి ప్రతీక అని, అందుకే ప్రతి విభాగం బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేసేలా శాఖల వారీగా శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులచే జాతీయతా భావాన్ని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, కార్యక్రమాలు క్రమబద్ధంగా సాగేలా ముందస్తు రిహార్సల్స్ నిర్వహించాలని తెలిపారు. అధికారులు, ఉద్యోగులకు అందించే ఉత్తమ సేవా పురస్కారాల విషయంలో వారి సేవలు, పారామీటర్లలో సాధించిన ప్రగతిని ప్రామాణికంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై ప్రసంగ పాఠం సిద్ధం చేయడానికి అవసరమైన నివేదికలను వెంటనే సమర్పించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. వేడుకల నిర్వహణలో భాగంగా పోలీసు శాఖ, హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి కలిసి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ మరియు కలెక్టరేట్ ప్రాంగణంలో వేదిక అలంకరణ, మార్చ్ ఫాస్ట్, స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్ అండ్ బి శాఖ బారికేడింగ్ ఏర్పాట్లు చేపట్టాలని, విద్యాశాఖ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు బాధ్యత వహించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా జనరేటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపల్ శాఖ ద్వారా విద్యుదీకరణ, త్రాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు సమర్థవంతంగా చేయాలని ఆదేశించారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి. గణేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రవి, హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి రాథోడ్ రమేష్, జిల్లా పంచాయితీ అధికారి లక్ష్మి రమాకాంత్తో పాటు విద్య, వైద్య, విద్యుత్, పోలీసు తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు హనుమకొండ జిల్లాలో ఘనంగా, శాంతియుతంగా, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేలా నిర్వహించేందుకు అన్ని శాఖలు కలిసికట్టుగా పని చేయాలని అదనపు కలెక్టర్ రవి పిలుపునిచ్చారు.

# మల్లన్నకు ఘనంగా సంప్రోక్షణ

**ఐనవోలు, (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు జాతరను పురస్కరించుకుని లక్షలాదిమంది భక్తులతో పూజలందుకున్న మల్లికార్జున స్వామివారికి శనివారం వైభవంగా మహాసంప్రోక్షణ క్రతువు నిర్వహించారు. పుణ్యావాచనంలో భాగంగా వేదపండితులు, అర్చకులు స్వచ్ఛమైన జలంలో సుగంధద్రవ్యాలు, నవధాన్యాలు కలశంలో మిళితం చేసి మంత్ర పఠనం చేస్తూ స్వామి వారిని ఆవాహన చేశారు. తదుపరి ఆలయంతో పాటు ప్రాంగణంలో వేద మంత్రాల మధ్య ప్రోక్షణ (చల్లడం) జరిపారు.మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం చేసి శివలింగాన్ని స్వామివారి ప్రతిబింబంతో అలంకరించి అన్నపూజ నిర్వహించి మంత్రపుష్ప తీర్థప్రసాద వితరణ గావించారు. అనంతరం ఈవో కందుల సుధాకర్ బ్రాహ్మణులకు పండిత సన్మానాలు సమారాధనజరిపారు. సంప్రోక్షణ అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.ఆలయ చైర్మన్ కమ్మగొని ప్రభాకర్,ఎస్సై పస్తం శ్రీనివాస్,ఉప ప్రధానర్చకులు పాతర్లపాటి రవీందర్,ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్,ఐనవోలు మధుకర్ శర్మ, వేదపండితులు గట్టు పురుషోత్తం శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్ శర్మ నందనం మధు, ఉప్పుల శ్రీనివాస్,పాతర్లపాటి నరేష్ శర్మ, మడికొండ దేవేందర్ అర్చక సిబ్బంది ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



# కాకినాడలో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ ఎనర్జీ కాంప్లెక్స్

**స్పందించిన జయప్రకాశ్ నారాయణ**

**ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో గ్రీన్ కో సంస్థ భారీ ప్రాజెక్ట్**

**ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా కాంప్లెక్స్ ఏర్పాటు**


**గ్రీన్ కోను మనస్ఫూర్తిగా అభినందించిన జయప్రకాశ్ నారాయణ**

**దేశ ఇంధన ప్రగతిలో ఇది కీలక మైలురాయి అని ప్రశంస**

**వికసిత భారత్ కోసం ఇలాంటి ఆవిష్కరణలు అవసరమని వ్యాఖ్య**

**కాకినాడ, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసిన గ్రీన్ కో సంస్థపై లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ ప్రశంసల వర్షం కురిపించారు. గ్రీన్ కో సంస్థకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ ప్రాజెక్ట్ వివరాలను ఆయన ప్రస్తావిస్తూ, “1950 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ సామర్థ్యంతో, 1.5 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యంతో ఏర్పాటైన ఈ గ్రీన్ అమ్మోనియా ప్లాంట్.. భారతదేశ ఇంధన రంగ పరివర్తనలో, అధిక విలువైన రసాయనాల ఉత్పత్తిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది“ అని పేర్కొన్నారు. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన, భారీ ప్రాజెక్టులే దేశ ఆర్థిక వ్యవస్థను మార్చగలవని జయప్రకాశ్ నారాయణ అభిప్రాయపడ్డారు. ఇలాంటి ముందుచూపుతో కూడిన ఆవిష్కరణలు, పెట్టుబడులు ‘వికసిత భారత్‘ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎంతో అవసరమని అన్నారు. దేశ ప్రగతి కోసం మరిన్ని ఇలాంటి ఆవిష్కరణలు, పెట్టుబడులు రావాలని ఆయన ఆకాంక్షించారు. గ్రీన్ కో చొరవ దేశానికి ఆదర్శమని కొనియాడారు.



# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర బీసీ యువ నాయకులు మెరుగు రవి గౌడ్



**మహబూబాబాద్, నెల్లికుదురు, 17 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర బీసీ యువ నాయకులు మెరుగు రవి గౌడ్ ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీఆర్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరి శంకర్ గౌడ్, సీనియర్ హైకోర్టు అడ్వకేట్ శ్రావణ్ కుమార్, టీఆర్పీ పార్టీ నాయకులు ఉపేందర్, తిరుపతి నాయక్తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బీసీ వర్గాల హక్కుల సాధన కోసం, సామాజిక న్యాయం కోసం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పేదల గొంతుకగా నిలుస్తున్న ఆయన నాయకత్వం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. బీసీల స్వాభిమానం, హక్కుల కోసం శాసన మండలిలో గళమెత్తుతున్న తీరును వారు ప్రశంసించారు. అనంతరం మెరుగు రవి గౌడ్ మాట్లాడుతూ, తీన్మార్ మల్లన్న మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆయన ఆరోగ్యవంతమైన దీర్ఘాయుష్షుతో ప్రజల మన్ననలు పొందుతూ ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బీసీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సంబరంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# జ్యోతి బసు జీవితం నేటి తరం యువ కమ్యూనిస్టులకు ఆదర్శం

**16వ వర్ధంతి కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మంద సంపత్ పిలుపు**



**హన్మకొండ, 17 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ నగరంలోని 31వ డివిజన్ మహాత్మ జ్యోతిరావు పూలే నగర్ పరిధిలో ఉన్న ఎంఆర్ భవన్లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు జ్యోతి బసు 16వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దూడపాక రాజేందర్ అధ్యక్షత వహించగా, సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు మంద సంపత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జ్యోతి బసు భారతదేశంలోని తొలి తరం కమ్యూనిస్టు నాయకుల్లో అగ్రగణ్యులని ఆయన గుర్తు చేశారు. పేదలు, కార్మికులు, కర్షకులు, ప్రభుత్వప్రైవేట్ రంగాల్లో పనిచేసే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆయన జీవితాంతం అంకితభావంతో పోరాడారని తెలిపారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో సీపీఎం తరఫున ఐదు సార్లు ముఖ్యమంత్రిగా సేవలందించిన జ్యోతి బసు, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా పాలన అందించారని, ప్రధానమంత్రి పదవి అవకాశాన్ని కూడా సూత్రబద్ధ రాజకీయాల కోసం త్యాగం చేసిన ఆదర్శ నాయకుడని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు ఎదురొడ్డి నిలబడి, ప్రజల పక్షాన అహర్నిశలు పోరాట స్ఫూర్తితో పనిచేసిన కార్మిక నాయకుడిగా ఆయన దేశానికి గర్వకారణమని అన్నారు. యువతకు జ్యోతి బసు జీవితం ఒక వెలుగుదారి అని, ముఖ్యంగా బీమా రంగం, ప్రభుత్వ రంగ సంస్థలు, ఎల్ఐసి వంటి సంస్థల పరిరక్షణలో ఆయన పోషించిన పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని మంద సంపత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి చెరుపల్లి కుమారస్వామి, దాసరి నరేష్, గుర్రం రమేష్, మేకల అఖిల, ఎండి రజియా, శ్రీవాణి, రోజా, నాగమణి, ఉపేందర్, సుజాత, లక్ష్మి, రజిత, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌ఫ్లుయెన్సర్ల ‘లక్కీడ్రా‘ ప్రకటనలు.. హెచ్చరించిన సజ్జనార్

**లక్కీడ్రా ఇన్‌ఫ్లుయెన్సర్ల పట్ల జాగ్రత్త ఉండాలని ప్రజలకు సూచన**

**బెట్టింగ్ యాప్‌ల దందా ఆగిపోవడంతో లక్కీడ్రా అంటూ వేషాలు వేస్తున్నారని ఆగ్రహం**

**చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించిన సజ్జనార్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

సామాజిక మాధ్యమాల్లో లక్కీ డ్రా పేరుతో జరుగుతున్న మోసాలపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పందించారు. “రీల్స్‌లో బిల్డప్... రియాల్టీలో ఫ్రాడ్, లక్కీ డ్రా ఇన్‌ఫ్లుయెన్సర్ల పట్ల జాగ్రత్త“ అంటూ ‘ఎక్స్‘ వేదికగా హెచ్చరించారు. లక్కీ డ్రా పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారంటూ ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఇన్‌ఫ్లుయెన్సర్లను విశ్వసించవద్దని ప్రజలకు సూచించారు. కొంతమంది ఇన్‌ఫ్లుయెన్సర్లు కార్లు, బైకులు, ప్లాట్లు, డీజేలు ఇస్తామని లక్కీ డ్రాల పేరుతో మోసాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ల దందా ఆగిపోవడంతో లక్కీ డ్రాలు అంటూ కొత్త వేషాలతో ఇన్‌ఫ్లుయెన్సర్లు దర్శనమిస్తున్నారని వెల్లడించారు. అమాయకపు ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని నిండా ముంచుతున్నారని, అలాంటి ఇన్‌ఫ్లుయెన్సర్లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ది ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ యాక్ట్-1978 ప్రకారం లక్కీ డ్రాల పేరుతో మోసం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మోసాలకు పాల్పడేవారు సెలబ్రిటీలైనా, సోషల్ మీడియా స్టార్లు అయినా సరే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పాప్యులారిటీని అడ్డం పెట్టుకుని ప్రజలను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

జై భీమ్ POWER OF PEOPLE

# జీవితం చాలా విలువైనది ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలి







### సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత

**వరంగల్, 17 జనవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ప్రతి వాహనదారుడు తన జీవితం ఎంతో విలువైనదని గుర్తించి అత్యంత జాగ్రత్తగా వాహనాలు నడపాలని సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత అన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర పోలీస్ శాఖ చేపట్టిన "అరైవ్ అలివ్ నెస్" కార్యక్రమంలో భాగంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కాజీపేట పోలీసుల ఆధ్వర్యంలో కాజీపేటలోని నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేలా వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల కారణంగా పెద్ద సంఖ్యలో యువత ప్రాణాలు కోల్పోతున్నారని, దీనికి ప్రధాన కారణం నిర్లక్ష్యంగా వాహనాలు నడపడమేనని పేర్కొన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, అధిక వేగాన్ని నియంత్రించడం వంటి అంశాలను ప్రతి ఒక్కరు కచ్చితంగా పాటించాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరిస్తూ, ట్రాఫిక్ నియమాలను గౌరవించి క్రమశిక్షణతో వ్యవహరిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. అదే కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాలు శిక్షల కోసం కాకుండా ప్రజల ప్రాణాలను కాపాడేందుకేనని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ వంటి తప్పిదాలే ఎక్కువ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, యువతే మార్పుకు ముందుండి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరమని అన్నారు. రహదారి భద్రత ఒక్క పోలీస్ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. "అరైవ్ అలైవ్ నెస్" కార్యక్రమం యువతలో మంచి మార్పు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్నలు మాట్లాడుతూ, కాజీపేట పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, విద్యార్థులు తాము తెలుసుకున్న విషయాలను కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేసి రహదారి భద్రతకు తోడ్పడాలని కోరారు. అనంతరం ఉత్తమమైన వ్యాసాలు రచించిన విద్యార్థులకు డీసీపీ బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని రహదారి భద్రతపై విలువైన అవగాహన పొందారు.

## 58వ సీనియర్ జాతీయ ఖో ఖో పోటీలు ఘనంగా ముగింపు

### నిర్వాహక కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు

**కాజీపేట, 17 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**



58వ సీనియర్ జాతీయ ఖో ఖో పోటీలు ఐదు రోజుల పాటు అత్యంత విజయవంతంగా, క్రీడాస్ఫూర్తిని ప్రతిబింబించేలా నిర్వహించబడి ఘనంగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి ఖో ఖో పోటీలను ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా నిర్వహించడంలో తమ అమూల్యమైన సహకారాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహక కమిటీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ముఖ్యంగా పోటీలకు విశేష ప్రచారం కల్పించి, క్రీడాకారుల ప్రతిభను ప్రజలందరికీ చేరువ చేసిన పత్రికా సాహోదరులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల పాత్ర మరువలేనిదిగా నిలిచింది. వారి నిరంతర కవరేజ్ వల్ల ఖో ఖో క్రీడకు మరింత గుర్తింపు లభించింది. అలాగే పోటీల నిర్వహణకు కావలసిన మౌలిక సదుపాయాలు, శుభ్రత, భద్రత ఏర్పాట్లు సమర్థంగా కల్పించి, శాంతియుత వాతావరణంలో పోటీలు సాగేందుకు సహకరించిన మున్సిపల్ అధికారులు, సిబ్బందికి నిర్వాహక కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తోంది. అదేవిధంగా పోటీల విజయానికి తోడ్పడిన స్వచ్ఛంద సేవకులు, క్రీడాభిమానులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందరి సహకారంతోనే 58వ సీనియర్ జాతీయ ఖో ఖో పోటీలు ఎలాంటి సమస్యలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యాయి. ప్రతి ఒక్కరి సమన్వయం, అంకితభావం ఈ పోటీలను మరింత ఘనంగా నిలిపింది. భవిష్యత్తులో కూడా ఇలాగే క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు మీ అందరి సహకారం కొనసాగాలని నిర్వాహక కమిటీ ఆకాంక్షిస్తూ, మరోసారి అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తోంది.

## సమాజ సేవకు గౌరవ ముద్ర డాక్టర్ రాధాక్రిష్ణకు నల్లబెల్లి గ్రామంలో ఘన సన్మానం





**నల్లబెల్లి, 17 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

నల్లబెల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ రాధాక్రిష్ణకు గౌరవ డాక్టరేట్ (హానరరీ డాక్టరేట్) లభించిన సందర్భంగా నల్లబెల్లి గ్రామంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మేరుగు వీరేశం గౌడ్ మరియు పంచాయతీ కార్యదర్శి స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేరుగు వీరేశం గౌడ్ మాట్లాడుతూ, సమాజ సేవ, ప్రజాహిత కార్యక్రమాలు, విద్యా మరియు వైద్య రంగాల్లో డాక్టర్ రాధాక్రిష్ణ చేసిన విశిష్ట కృషికి గాను ఆయనకు గౌరవ డాక్టరేట్ రావడం నల్లబెల్లి గ్రామానికి గర్వకారణమన్నారు. ఇలాంటి గౌరవాలు గ్రామ యువతకు ఆదర్శంగా, ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి స్వప్న మాట్లాడుతూ, డాక్టర్ రాధాక్రిష్ణ సేవాభావం, నిబద్ధత ప్రశంసనీయమని, గ్రామం తరఫున ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. సన్మాన కార్యక్రమంలో డాక్టర్ రాధాక్రిష్ణ మాట్లాడుతూ, వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం సాగించిన పోరాటం, అలాగే విద్యావైద్య రంగాల్లోని అవినీతిపై నిరంతరం చేసిన కృషిని గుర్తించి ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ చైర్మన్ డాక్టర్ సాయి రమేష్ గౌడ్ బృందం తనకు ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని తెలిపారు. ఈ గౌరవంతో తనపై సామాజిక బాధ్యత మరింత పెరిగిందని, సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని కోరారు. తాను పుట్టిన ఊరు, తనను ఆదరించిన గ్రామ ప్రజలు, మిత్రులు, కుటుంబ సభ్యులకు సదా రుణపడి ఉంటానని కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. తనకు లభించిన ఈ గౌరవం వెనుక సాయి రమేష్ గౌడ్ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, మిత్రుల ప్రోత్సాహమే ప్రధాన కారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా సమాజ సేవ, గ్రామాభివృద్ధి కోసం తన వంతు బాధ్యతగా పనిచేస్తానని డాక్టర్ రాధాక్రిష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రయ్య రాజావీరు, దశరథం, సాంబయ్య బుచ్చయ్య, సంపత్‌తో పాటు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత తదితరులు పాల్గొని డాక్టర్ రాధాక్రిష్ణను ఘనంగా అభినందించారు.

## కత్తులతో దాడి చేసుకున్న టీడీపీ, వైసీపీ కార్యకర్తలు.. టీడీపీ కార్యకర్త మృతి

### కాకినాడ జిల్లా అల్లిపూడి గ్రామంలో ఉద్రిక్తత
### దాడిలో నలుగురికి తీవ్ర గాయాలు
### గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేసిన పోలీసులు

**కాకినాడ, జై భీమ్ న్యూస్**



కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకోవడంతో, ఇరు వర్గాలు కత్తులతో దాడి చేసుకున్నాయి. ఈ దాడిలో టీడీపీ కార్యకర్త బంగారయ్య మృతి చెందాడు. మరో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు దుర్గా ప్రసాద్, శ్రీరామమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వీరిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైసీపీ కార్యకర్తలు నారాయణమూర్తి, సతీశ్ లకు కూడా తీవ్ర గాయాలు కావడంతో... వీరిని కూడా ఆసుపత్రికి తరలించారు. ఘర్షణ వివరాల్లోకి వెళితే... టీడీపీ కార్యకర్తలు ఒక పుట్టినరోజు వేడుకకు వెళ్లి వస్తుండగా వారికి వైసీపీ కార్యకర్తలు ఎదురుపడ్డారు. ఈ క్రమంలో ఘర్షణ చోటుచేసుకుంది. పాత గొడవలే దీనికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

## అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు

### మడికొండ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలుర పాఠశాలలో క్విజ్, వ్యాస రచన, రంగోలి పోటీలు








**మడికొండ, 17 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు అవగాహన కార్యక్రమాన్ని మడికొండలో విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మడికొండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజ్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది కలిసి టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలుర పాఠశాలలో రోడ్డు భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో రహదారి భద్రతపై అవగాహన పెంచేందుకు "రోడ్డు ప్రమాదాలను నివారించడంలో బాధ్యతాయుత పౌరుడి పాత్ర" అనే అంశంపై క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని, చిన్న వయసు నుంచే రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని అన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి అంశాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా రోడ్డు భద్రత అంశంపై విద్యార్థులతో రంగోలి పోటీలు నిర్వహించి, రహదారి భద్రతకు సంబంధించిన సందేశాలను చిత్రాల రూపంలో వ్యక్తపరచేలా ప్రోత్సహించారు. రంగోలి పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని "సేఫ్ డ్రైవ్ సేవ్ లైఫ్", "హెల్మెట్ తప్పనిసరి", "ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం" వంటి సందేశాలను ఆకర్షణీయంగా చిత్రించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన మరింత పెరిగిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజ్ కుమార్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది ఒక్క పోలీస్ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు తాము నేర్చుకున్న రోడ్డు భద్రతా అంశాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేసి సమాజంలో మార్పుకు దోహదపడాలని సూచించారు. సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే ప్రతి ప్రయాణికుడి లక్ష్యంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోగా, పాఠశాల ఉపాధ్యాయులు మరియు యాజమాన్యం పోలీస్ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో కూడా పాఠశాలలు, కళాశాలల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని మడికొండ పోలీసులు స్పష్టం చేశారు.

## వర్ధన్నపేటనర్సంపేట మున్సిపాలిటీల వార్డు రిజర్వేషన్లు ఖరారు



**వరంగల్ జిల్లా, జనవరి 17, 2026 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపాలిటీలకు సంబంధించిన వార్డు రిజర్వేషన్ల ప్రక్రియను శనివారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మున్సిపల్ ఎన్నికల వార్డులకు డ్రా (లాటరీ) పద్ధతిలో రిజర్వేషన్లను కేటాయించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట మున్సిపాలిటీలో మొత్తం 12 వార్డులకు గాను ఎస్టీకి 3 వార్డులు (2, 7, 8), ఎస్సీకి 2 వార్డులు (1, 12), బీసీకి 1 వార్డు (11), జనరల్‌కు 6 వార్డులు (3, 4, 5, 6, 9, 10) కేటాయించినట్లు ప్రకటించారు. అలాగే 50 శాతం మహిళా రిజర్వేషన్ ప్రకారం 2, 4, 5, 9, 10, 12 వార్డులను మహిళలకు కేటాయించినట్లు తెలిపారు. నర్సంపేట మున్సిపాలిటీలో మొత్తం 30 వార్డులకు గాను ఎస్టీకి 3 వార్డులు (12, 13, 16), ఎస్సీకి 4 వార్డులు (5, 22, 23, 30), బీసీకి 8 వార్డులు (3, 8, 19, 24, 25, 27, 28, 29), జనరల్‌కు 15 వార్డులు (1, 2, 4, 6, 7, 9, 10, 11, 14, 15, 17, 18, 20, 21, 26) కేటాయించారు. 50 శాతం మహిళా రిజర్వేషన్ నిబంధనల మేరకు డ్రా పద్ధతిలో 12, 5, 23, 8, 25, 27, 28, 1, 2, 9, 11, 14, 18, 20, 26 వార్డులను మహిళలకు కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, వీడియో గ్రాఫీ మధ్య లాటరీ పద్ధతిలో పూర్తిస్థాయి పారదర్శకతతో రిజర్వేషన్ల ప్రక్రియను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వరంగల్ ఆర్డీవో సుమ, వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ సుధీర్ కుమార్, నర్సంపేట మున్సిపల్ కమిషనర్ భాస్కర్తో పాటు వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ ముక్కలవడం ఖాయం: రాంచందర్ రావు

### మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందన్న రాంచందర్ రావు
### ప్రజాల విశ్వాసాన్ని బీఆర్ఎస్ కోల్పోయిందని వ్యాఖ్య
### కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల రాజకీయాలకు పరిమితమయిందని విమర్శ

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ పూర్తిగా సిద్ధంగా ఉందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చూపిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు ఐదు వేల సర్పంచ్ స్థానాల్లో పోటీ చేశామని, గతంతో పోలిస్తే బీజేపీ గెలుపు సంఖ్య పెరిగిందని చెప్పారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలపడుతోందనేందుకు స్పష్టమైన నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని... ఆ పార్టీ ముక్కలవడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై విమర్శలు గుప్పిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల రాజకీయాలకు పరిమితమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతోందని, అయినా కాంగ్రెస్ కేంద్ర పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

# తెలంగాణ వారసత్వ శాఖ కాకతీయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ)

**వారసత్వ పరిరక్షణ, పర్యాటక అభివృద్ధికి కొత్త దిశ**

**హన్మకొండ, 17 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వం వారసత్వ శాఖ (డిపార్ట్మెంట్ అఫ్ హెరిటేజ్), వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర, పర్యాటక నిర్వహణ విభాగం మధ్య కీలకమైన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ అవగాహన ఒప్పంద పత్రాల మార్పిడి హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఐఏఎస్ మరియు కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి కె. ప్రతాప్ రెడ్డి సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం తరఫున రిజిస్ట్రార్ రామచంద్రం, అలాగే వారసత్వ శాఖ తరఫున డైరెక్టర్ కుతాడి అర్జున రావు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆతిథ్య, పర్యాటక రంగాలకు విస్తృత అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఈ అవగాహన ఒప్పందం ద్వారా ఇరు సంస్థలకు పరస్పర ప్రయోజనం చేకూరనుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఎంఓయూ ద్వారా విద్యార్థులకు పురావస్తు ప్రదేశాలు, మ్యూజియంలు, వారసత్వ కట్టడాలకు ప్రత్యక్ష ప్రాప్యత లభించనుంది. అలాగే ఇంటర్న్‌షిప్ అవకాశాలు, ప్రాయోగిక శిక్షణ (ప్రాక్టికల్ ఎక్స్‌పోషర్), దాగి ఉన్న మరియు కొత్త పరిశోధనా రంగాలను అన్వేషించే అవకాశం కూడా కల్పించనుంది. ముఖ్యంగా వారసత్వ పరిరక్షణ, మ్యూజియాలజీ, కన్జర్వేషన్, సాంస్కృతిక నిర్వహణ రంగాల్లో దీర్ఘకాలిక సహకారాన్ని ఏర్పరచడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. ఈ సహకారంలో భాగంగా ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు, తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉమ్మడి వారసత్వపర్యాటకప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



మ్యూజియం ఆధారిత విద్య, ప్రజల్లో వారసత్వ అవగాహన పెంపు, సాంస్కృతిక పర్యాటక అభివృద్ధి, వారసత్వ రంగంలో సామర్థ్య పెంపుదల ఈ ఒప్పందం యొక్క ముఖ్య లక్ష్యాలుగా వెల్లడించారు. దీని ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, వారసత్వ రంగంపై ఆసక్తి ఉన్నవారికి విద్యాపరమైన అనుభవంతో పాటు ప్రాయోగిక నైపుణ్యాలు అలవడనున్నాయి. ఈ అవగాహన ఒప్పందం కింద ఇరు పక్షాలు వారసత్వ ప్రచారం కోసం ఉమ్మడి ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, అతిథి ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అంగీకరించాయి. పర్యాటక అభివృద్ధిలో భాగంగా టూరిజం సర్క్యూట్‌లు, గైడెడ్ టూర్‌లు, సాంస్కృతిక అవుట్‌రీచ్ ద్వారా మ్యూజియంలు, స్మారక చిహ్నాల ప్రచారం చేపట్టనున్నారు. అలాగే ఆర్కైవ్ పరిశోధనలు, క్షేత్రస్థాయి డాక్యుమెంటేషన్, డిజిటలైజేషన్ ప్రాజెక్టులు, శిక్షణ, సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు, క్యూరేషన్‌కన్జర్వేషన్‌హెరిటేజ్ మేనేజ్‌మెంట్‌లో సాంకేతిక మార్గదర్శకత్వం, ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలు, పరిశోధన విద్యార్థులకు సంయుక్త మార్గదర్శకత్వం వంటి అంశాల్లో సహకారం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ తాళ్లపల్లి మనోహర్, చరిత్ర, పర్యాటక నిర్వహణ విభాగాధిపతి చిలువేరు రాజ్ కుమార్, ఉప సంచాలకుడు నాగరాజు, అలాగే ఎంఓయూ మార్పిడి కార్యక్రమంలో ఓఎస్‌డీ రాజు హాజరయ్యారు. ఈ అవగాహన ఒప్పందం తెలంగాణలో వారసత్వ పరిరక్షణ, సాంస్కృతిక పర్యాటక అభివృద్ధి, యువతకు నైపుణ్యాభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేస్తాం

**బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎర్రబెల్లి దయాకర్ రావు ధీమా**

**వర్ధన్నపేట, 17 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**



త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం ఉదయం వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని భారతీయ నాటక కళ సమితి హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ, రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో వర్ధన్నపేట మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్ధన్నపేట మండల కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీస్ స్టేషన్ స్థలాన్ని కేటాయించినప్పటికీ, ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు అధికార దుర్వినియోగంతో ఆసుపత్రిని నియోజకవర్గ కేంద్రం కాకుండా వేరే ప్రాంతానికి మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వర్ధన్నపేట నియోజకవర్గం అభివృద్ధిలో ముందంజలో ఉండటానికి ప్రధాన కారణం కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) అని స్పష్టం చేస్తూ, వర్ధన్నపేట గ్రామాన్ని మున్సిపాలిటీగా మార్చి సమగ్ర అభివృద్ధికి బాటలు వేసిన మహానీయుడు కేసీఆర్ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ప్రజలకు చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏమీ చేయలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే ప్రజలు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, వర్ధన్నపేట మున్సిపాలిటీలోని 12 వార్డులకు 12 కూడా బిఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం అనంతరం కాంగ్రెస్, టీడీపీ పార్టీలకు చెందిన సుమారు 100 మంది నాయకులు గులాబీ కండువా కప్పుకొని బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ వార్డు సభ్యులు ఆత్మకూరి వెంకటేశ్వర్లు, బొంత రంగనాథ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీడీపీ జిల్లా యూత్ కార్యదర్శి తుమ్మల విజయ్ కుమార్, తోట రవి కుమార్, బొంత సుధాకర్, అలకుంట్ల అనురాజ్, బొంత ప్రవీణ్, పిన్నింటి వెంకటేశ్వర్ రావు, బండారి రమేష్, సుర భాస్కర్, బండారి సాయి, బొంత లక్ష్మణ్, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జంజరాపు శ్రీనివాస్, కేదారి, భూక్య గోపాల్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుల కుమార్, టౌన్ అధ్యక్షుడు మధుసుదన్, మాజీ జెడ్పీటీసీ మార్గం బిక్షపతి, మాజీ ఎంపీపీ అప్పారావు సహా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# మానవ తప్పిదాల వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు అంబర్ కిషోర్ ఝూ

**పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతపై వ్యాసరచన, ముగ్గుల, పెయింటింగ్ పోటీలు**

**పెద్దపల్లి, 17 జనవరి 2026 (జై భీమ్ న్యూస్) :**

ఆరైవ్‌అలైవ్ పది రోజుల రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సురక్షిత ప్రయాణం క్షేమంగా గమ్యానికి అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విస్తృతంగా నిర్వహించినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాలు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అమలు చేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలను కేంద్రంగా చేసుకుని విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై లోతైన అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టారు. శనివారం రోజున విద్యార్థుల్లో చైతన్యం, బాధ్యత పెంచే ఉద్దేశంతో వ్యాసరచన, ముగ్గుల, పెయింటింగ్ పోటీలు నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా చిన్న వయసు నుంచే రోడ్డు భద్రత పట్ల అవగాహన పెరిగి, భవిష్యత్తులో ప్రమాదాలను తగ్గించే దిశగా సమాజం ముందుకు సాగుతుందని పోలీసులు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు రోడ్డుపై నడిచేటప్పుడు, సైకిల్ లేదా వాహనాలు ఉపయోగించేటప్పుడు పాటించాల్సిన ప్రాథమిక నియమాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ మాట్లాడుతూ, దేశంలో సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మానవ తప్పిదాల వల్లనే జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించకపోవడం, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను నిర్లక్ష్యం చేయడం వంటి కారణాలు అనేక విలువైన ప్రాణాలను బలి తీసుకుంటున్నాయని తెలిపారు. చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ రోడ్డు భద్రతా అవగాహనను తమకే పరిమితం కాకుండా, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల ప్రజలతో కూడా పంచుకోవాలని సూచించారు. భవిష్యత్ పౌరులైన విద్యార్థులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ, సురక్షిత ప్రయాణానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం ఒక్కటేనని, ప్రతి వ్యక్తి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా, సురక్షితంగా, క్షేమంగా గమ్యానికి చేరుకోవడమేనని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తరహా అవగాహన కార్యక్రమాలు రానున్న రోజుల్లో కూడా కొనసాగుతాయని తెలిపారు.

# యూసుఫ్ గూడలో పేలిన వాషింగ్ మెషిన్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ లోని యూసుఫ్ గూడ పరిధిలో ఓ ఇంట్లో వాషింగ్ మెషిన్ పేలిపోయింది. తొలుత మెషిన్ నుంచి మంటలు వచ్చాయని, కాసేపటికే భారీ శబ్దంతో పేలుడు సంభవించిందని ఆ ఇంట్లో వాళ్లు చెప్పారు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో వాషింగ్ మెషిన్ దగ్గర్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని తెలిపారు. మెషిన్ పేలుడుకు ఆ గదిలోని పలు వస్తువులు దెబ్బతిన్నాయని, వాషింగ్ మెషిన్ మొత్తం తుక్కుతుక్కుగా మారిందని వివరించారు. యూసుఫ్ గూడ పరిధిలోని కృష్ణానగర్ లో సయ్యద్ గౌస్ కు రెండు ఫ్లోర్ల బిల్డింగ్ ఉంది. సెకండ్ ఫ్లోర్ లోని పోర్షన్ ను అద్దెకు తీసుకున్న సాంబశివారెడ్డి అనే వ్యక్తి.. అందులో భార్యతో కలిసి నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ రోజు ఉదయం బట్టలు ఉతికేందుకు వాషింగ్ మెషిన్ ఆన్ చేయగా అందులో నుంచి మంటలు వచ్చాయి. కాసేపటికి పొగతోపాటు పెద్ద శబ్దంతో వాషింగ్ మెషిన్ పేలిపోయింది. వాషింగ్ మెషిన్ ముక్కలుముక్కలైంది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. ఈ దుర్ఘటనలో ఇల్లంతా చిందరవందర కాగా పలు వస్తువులు పాడైపోయాయి. అదృష్టవశాత్తూ ఇంట్లో ఎవరికీ గాయాలు కాలేదని సాంబశివారెడ్డి తెలిపారు.

# 11 సీట్లకే పరిమితమైనా మీ 'తాచుపాము' బుద్ధి మారలేదు: మంత్రి పార్థసారథి

**ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ విషం చిమ్ముతోందని మంత్రి పార్థసారథి విమర్శ**

**నాడు అసెంబ్లీలో జై కొట్టి, అధికారంలోకి వచ్చాక జగన్ మాట మార్చారని ఆరోపణ**

**సొంత ప్యాలెస్‌లకు వేల కోట్లు ఖర్చుపెట్టారని, రాజధానికి మాత్రం అడ్డుపడుతున్నారని ఫైర్**

**అమరావతి పనులు వేగవంతం చేశాం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే కూటమి లక్ష్యమని స్పష్టీకరణ**




**అమరావతి, జై భీమ్ న్యూస్**

"2024 ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురై కేవలం 11 సీట్లకే పరిమితమైనా వైసీపీ నేతల 'తాచుపాము' బుద్ధి మారకపోవడం రాష్ట్ర దౌర్భాగ్యం" అని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిపై, ముఖ్యంగా ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ విషప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయడమే లక్ష్యంగా వైసీపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. "హెల్దీ-హ్యాపీ-వెల్తీ స్టేట్ అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంటే, రాష్ట్రంలో కనిపిస్తున్న ఆశాజనక వాతావరణాన్ని దెబ్బతీయడమే వైసీపీ పనిగా పెట్టుకుంది. ఒకప్పుడు ఇదే అసెంబ్లీలో అమరావతికి మనస్ఫూర్తిగా 'జై' కొట్టిన జగన్మోహన్ రెడ్డి, అధికారం రాగానే 'నై' అని మాట మార్చి రాష్ట్ర ప్రజలను దారుణంగా వంచించారు. ఐదేళ్ల పాటు రాజధాని లేకుండా చేసి ప్రజల కలలను విధ్వంసం చేశారు" అని పార్థసారథి మండిపడ్డారు. 2019కి ముందు అమరావతే రాజధాని అని, తాను తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నానని నమ్మబలికిన జగన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక తుగ్లక్ పాలనను తలపించేలా మూడు రాజధానుల నాటకం ఆడారని విమర్శించారు. రాజధాని కోసం 33 వేల ఎకరాలు త్యాగం చేసిన 29 వేల మంది రైతులను అవమానించారని, అమరావతిని ఎడారి, శ్మశానంతో పోల్చారని గుర్తుచేశారు. "సొంత అవసరాల కోసం వందల ఎకరాల్లో, వేల చదరపు అడుగుల ప్యాలెస్‌లు కట్టుకున్న నాయకులు, ఐదు కోట్ల ప్రజలకు రాజధాని అవసరమా అని ప్రశ్నించడం సిగ్గుచేటు. కులాల మధ్య చిచ్చు, ప్రాంతాల మధ్య విషం చిమ్ముతూ నీచ రాజకీయాలు చేయడం జగన్ రెడ్డికి అలవాటుగా మారింది" అని దుయ్యబట్టారు. అమరావతిపై ఇన్సైడర్ ట్రేడింగ్ అంటూ అసత్య ఆరోపణలు చేసి హైకోర్టు, సుప్రీంకోర్టుల చేత మొట్టికాయలు తిన్నా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదని పార్థసారథి అన్నారు. "పీపీపీ విధానంలో రాష్ట్రానికి వచ్చే సంస్థలను 'మేం వస్తే అరెస్ట్ చేస్తాం' అని బెదిరించడం అత్యంత జుగుప్సాకరం. ఇది రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసే కుట్ర కాదా?" అని ప్రశ్నించారు. చంద్రబాబు సైబరాబాద్‌ను నిర్మించినప్పుడు కూడా ఇలాంటి విమర్శలే వచ్చాయని, కానీ నేడు ఆ ప్రాంతం విలువ అందరికీ తెలుసని అన్నారు. అమరావతి పూర్తయితే వచ్చే లక్షల కోట్ల సంపదతోనే రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతిలో పనులు శరవేగంగా సాగుతున్నాయని, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులతో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లోనూ టీసీఎస్, రిలయన్స్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. "రాజ్యాంగంపై గౌరవం లేని వైసీపీ, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం లేక బయట కూర్చుని విషప్రచారం చేస్తోంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఈ నిజాన్ని ప్రజలు గ్రహించి, విధ్వంసకర శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి" అని మంత్రి పార్థసారథి పిలుపునిచ్చారు.

# తెలంగాణలో కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు ఖరారు

**121 మున్సిపాలిటీల్లో ఎస్టీలకు 5, ఎస్సీలకు 17, బీసీలకు 38 చైర్‌పర్సన్ పదవుల కేటాయింపు**

**మహిళలకు 50 శాతం రిజర్వేషన్ల కేటాయింపు**

**మహిళా జనరల్‌కు హైదరాబాద్ కార్పొరేషన్ కేటాయింపు**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్రంలోని కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. 121 మున్సిపాలిటీల్లో ఎస్టీలకు 5, ఎస్సీలకు 17, బీసీలకు 38 మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవులను కేటాయించారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ మేరకు మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ కార్పొరేషన్‌లకు ఖరారు చేసిన రిజర్వేషన్లు ఈ విధంగా ఉన్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్‌కు ఎస్టీ జనరల్, రామగుండం కార్పొరేషన్‌కు ఎస్సీ జనరల్, మహబూబ్ నగర్ కార్పొరేషన్ బీసీ మహిళ, మంచిర్యాల కార్పొరేషన్ బీసీ జనరల్, కరీంనగర్ కార్పొరేషన్ బీసీ జనరల్, జీహెచ్‌ఎంసీ మహిళ జనరల్, గ్రేటర్ వరంగల్ జనరల్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్ కార్పొరేషన్‌లలో మహిళ జనరల్‌ను ఖరారు చేశారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

## “విద్య ఒక్కటే జీవితాన్ని మార్చగలదు” విద్యార్థులకు సీఎం ప్రేరణాత్మక సందేశం



**హైద్రాబాద్, 17 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

లక్ష్యం ఉన్నతంగా ఉండాలని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విద్యార్థినీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. భాషా పరిజ్ఞానం, జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. నిబద్ధత, క్రమశిక్షణతో కూడిన విద్యే యువతను సమాజంలో ఉన్నతంగా నిలబెడుతుందని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిట్టబోయినపల్లిలో ఏర్పాటు చేయనున్న రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఐఐఐటి) భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ నిర్వహించి, వారు ప్రస్తావించిన అంశాలపై స్పందిస్తూ విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ఉజ్వలమైన భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. విద్యారంగ అభివృద్ధినే ప్రభుత్వ టాప్ ప్రాధాన్యంగా పెట్టుకున్నామని సీఎం తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నామని, మహబూబ్‌నగర్ జిల్లాలో ఐఐఐటీతో పాటు ఇంజినీరింగ్, లా, మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. యూపీఎస్సీ (సివిల్స్) పరీక్షలకు హాజరై మెయిన్స్, ఇంటర్వ్యూలకు ఎంపికైన యువతకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ప్రపంచంతో పోటీ పడే స్థాయికి తెలంగాణ యువతను తీసుకెళ్లాలన్న ఉద్దేశంతోనే ఈ చర్యలన్నీ చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎంత ఎదిగినా కన్న తల్లిదండ్రులను, పుట్టిన ఊరును మరవకూడదని సీఎం సూచించారు. 25 ఏళ్ల వయస్సు వరకు కష్టపడి చదువుకోవాలని, చదువే సమాజంలో గౌరవాన్ని తీసుకువస్తుందని చెప్పారు. దేశంలో ఎక్కడికి వెళ్లినా తెలంగాణకు గుర్తింపు, గౌరవం తీసుకురావాలన్నది యువత బాధ్యతగా పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం జమీందార్లు, జాగీర్దార్ల వద్ద ఉన్న భూములను పేదలకు పంపిణీ చేసిన చరిత్రను గుర్తు చేస్తూ, ఇప్పుడు పంచేందుకు భూములు లేవని, ఇళ్ల పట్టాలు ఇవ్వడమే కష్టంగా మారిందని సీఎం తెలిపారు. ప్రభుత్వం ఇవ్వగలిగింది విద్య మాత్రమేనని, విద్య ఒక్కటే జీవితాన్ని మార్చగల శక్తి కలిగిందని అన్నారు. అభివృద్ధి చెందిన పౌరులుగా నిలదొక్కుకునేందుకు విద్యే మార్గమని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు గారు హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారని గుర్తు చేసిన సీఎం, 75 ఏళ్ల తర్వాత మళ్లీ అదే జిల్లాకు ముఖ్యమంత్రి పదవి రావడం గర్వకారణమన్నారు. 2006లో జిల్లా పరిషత్ సభ్యుడిగా ప్రారంభమైన తన రాజకీయ ప్రయాణం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీగా కొనసాగి, పెద్దల సహకారంతో ముఖ్యమంత్రిగా అవకాశం దక్కిందని వివరించారు. ఈ రోజు భూమిపూజ చేసిన ఐఐఐటీ భవన నిర్మాణాన్ని ఏడాది కాలంలో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు ఎలాంటి తొణుకుబెణుకు లేకుండా ధైర్యంగా మాట్లాడటం అందరినీ ఆకట్టుకుంది. రూ.200 కోట్లతో నిర్మించనున్న ఐఐఐటీ భూమిపూజ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీలు మల్లు రవి, డీకే అరుణతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రోహిత్ వేముల చట్టం ఒక ప్రకటన కాదు, అది ఒక అవసరం: రాహుల్ గాంధీ

### రోహిత్ వేముల కుల వివక్షకు గురై నేటితో 10 సంవత్సరాలు



**న్యూ ఢిల్లీ జై భీమ్ న్యూస్ :**

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ విద్యార్థి రోహిత్ వేముల కుల వివక్షకు గురై నేటితో 10 సంవత్సరాలు అయింది, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ రోహిత్‌ను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్ట్‌ను పోస్ట్ చేశారు. అలాగే, ఉన్నత విద్యా సంస్థలలో కుల వివక్షను ప్రస్తావిస్తూ, దానిపై కఠినమైన చట్టాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో, దళిత యువత తమ గొంతులను వినిపించాలని ఆయన పిలుపునిచ్చారు. “రోహిత్ వేముల మరణించి 10 సంవత్సరాలు అయ్యింది. కానీ, “ఈ దేశంలో అందరికీ కలలు కనే సమాన హక్కులు ఉన్నాయా?” అనే ఆయన ప్రశ్న ఇప్పటికీ మన హృదయాల్లో ప్రతిధ్వనిస్తోంది” అని రాహుల్ గాంధీ అన్నారు. “రోహిత్ చదవాలని, రాయాలని కోరుకున్నాడు. సైన్స్, సమాజం మరియు మానవత్వాన్ని అర్థం చేసుకోవడం ద్వారా ఈ దేశాన్ని మెరుగుపరచాలని అతను కోరుకున్నాడు. కానీ ఈ వ్యవస్థ ఒక దళితుడు ముందుకు రావాలని కోరుకోలేదు. “సంస్థాగత కులతత్వం, సామాజిక బహిష్కరణ, రోజువారీ అవమానం, ‘యోగ్యత’ గురించి మాట్లాడే భాష మరియు అమానవీయ ప్రవర్తన – ఇది ఒక ప్రతిభావంతుడైన యువకుడి గౌరవాన్ని దోచుకుని, అతన్ని ఒంటరితనం స్థాయికి నెట్టివేసిన విషం,” అని అతను చెప్పాడు. “మళ్ళీ నేడు? దళిత యువత వాస్తవికత ఏమైనా మారిందా? క్యాంపస్‌లలో అదే ధిక్కారం, హాస్టళ్లలో అదే ఒంటరితనం, తరగతుల్లో అదే అవమానం, అదే హింస – మరియు కొన్నిసార్లు అదే మరణం. ఎందుకంటే కులం ఇప్పటికీ ఈ దేశంలో అతిపెద్ద ప్రవేశ ద్వారం,” అని అతను అన్నాడు. “అందుకే రోహిత్ వేముల చట్టం కేవలం నినాదం కాదు, అది ఒక అవసరం. విద్యా సంస్థలలో కుల వివక్షను నేరంగా మార్చడం, దోషులపై కఠిన చర్యలు తీసుకోవడం మరియు వారి కులం పేరుతో ఏ విద్యార్థినైనా అవమానించడం చేయడం మరియు బహిష్కరించడం అంతం చేయడం అవసరం” అని రాహుల్ గాంధీ అన్నారు. “ఈ పోరాటం పార్లమెంటు కోసం మాత్రమే కాదు. ఈ పోరాటం క్యాంపస్‌ల కోసం, యువత కోసం, మనందరి కోసం. దళిత యువత – మీ గొంతు పెంచండి, ఐక్యంగా ఉండండి, ఒకరికొకరు మద్దతుగా నిలబడండి. రోహిత్ వేముల చట్టాన్ని వెంటనే అమలు చేయండి మరియు ఇప్పుడే వివక్ష నిరోధక చట్టాన్ని డిమాండ్ చేయండి, ”అని ఆయన అన్నారు. “కర్ణాటక మరియు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమలు చేసే ప్రక్రియలో ఉన్నాయి. మేము న్యాయమైన, మానవీయ మరియు సమానమైన భారతదేశాన్ని కోరుకుంటున్నాము – ఇక్కడ ఏ దళిత విద్యార్థి కూడా తన కలల కోసం తన జీవితాన్ని త్యాగం చేయాల్సిన అవసరం లేదు. రోహిత్, మీ పోరాటం మా బాధ్యత” అని రాహుల్ గాంధీ రాశారు.

# సమ్మక్కసారలమ్మ జాతర ప్రాశస్త్యం

**హైద్రాబాద్, 17 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రం, ములుగు జిల్లాలోని మేడారంలో జరిగే సమ్మక్కసారలమ్మ జాతర రాష్ట్రంలోనే కాక ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరుగాంచింది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ మహా జాతర ఈ ఏడాది జనవరి 28 నుంచి 31, 2026 వరకు జరుగుతోంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి సుమారు కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటారు. చారిత్రక కథనాల ప్రకారం, 12వ శతాబ్దంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాల ప్రాంతంలోని పొలవాసను పాలించిన ఆదివాసీ దొర మేడరాజుకు ఏకైక కుమార్తె సమ్మక్క. ఆమెను మేడారం పాలకుడు, ఆయన మేనల్లుడైన పగిడిద్దరాజుకు వివాహం చేశారు. ఈ దంపతులకు సారలమ్మ, జంపన్న అనే ఇద్దరు సంతానం. కాకతీయులకు చెల్లించాల్సిన కప్పం కట్టలేదన్న కారణంతో కాకతీయ రాజు మొదటి ప్రతాపరుద్రుడు పొలవాసపై దండెత్తాడు. పరిస్థితుల కారణంగా మేడరాజు మేడారంలో అజ్ఞాతవాసం గడపాల్సి వచ్చింది. మేడారాన్ని పాలిస్తున్న పగిడిద్దరాజు కూడా కరువు కాటకాల వల్ల కప్పం చెల్లించలేకపోయాడు. కప్పం చెల్లించకపోవడం, మేడరాజుకు ఆశ్రయం కల్పించడం, ఆదివాసీ సార్వభౌమత్వానికి మద్దతుగా నిలవడం వంటి కారణాలతో ఆగ్రహించిన ప్రతాపరుద్రుడు తన ప్రధానమంత్రి యుగంధరుడితో కలిసి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున మేడారంపై దండెత్తాడు. ఈ యుద్ధంలో పగిడిద్దరాజు, సమ్మక్క, సారలమ్మ, జంపన్న, గోవిందరాజులు సాంప్రదాయ ఆయుధాలతో వీరోచితంగా పోరాడారు. అయినప్పటికీ శిక్షణ పొందిన అపార కాకతీయ సేనల ఎదుట పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు యుద్ధంలో వీరమరణం పొందారు. ఈ పరాజయ వార్త విన్న జంపన్న అవమానాన్ని తట్టుకోలేక సంపెంగ వాగులో దూకి ఆత్మాహుతి చేసుకున్నాడు. అప్పటి నుంచే ఆ వాగు జంపన్న వాగుగా ప్రసిద్ధి చెందింది. యుద్ధభూమిలో సమ్మక్క ఒంటరిగా నిలబడి కాకతీయ సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టింది. ఒక ఆదివాసీ మహిళ ప్రదర్శించిన అపూర్వ యుద్ధ నైపుణ్యానికి ప్రతాపరుద్రుడే ఆశ్చర్యచకితుడయ్యాడని కథనం. చివరకు శత్రువులు వెనుక నుంచి బరిసెతో పొడిచిన అనంతరం, రక్తధారలతోనే సమ్మక్క యుద్ధభూమి విడిచి చిలుకల గుట్ట వైపు వెళ్లుతూ మార్గమధ్యంలో అదృశ్యమైంది. ఆమె కోసం వెతికిన అనుచరులకు జాడ దొరకలేదు. అయితే ఆ ప్రాంతంలోని ఒక పుట్ట వద్ద పసుపు, కుంకుమలతో కూడిన కుంకుమ భరణ లభించడంతో దానినే సమ్మక్కగా భావించి, అప్పటి నుంచి ప్రతి రెండేళ్లకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున సమ్మక్కసారలమ్మ జాతరను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈసారి 2026లో జనవరి 28 నుంచి 31 వరకు మేడారం సమ్మక్కసారలమ్మ జాతర ఘనంగా జరగనుంది. జాతర మొదటి రోజు 28-01-2026న కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకువస్తారు. అదే రోజు కొండాయి నుంచి గోవిందరాజులను, పూనుగుండ్ల నుంచి పగిడిద్దరాజులను గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. రెండో రోజు 29-01-2026న చిలుకల గుట్ట నుంచి పూజారులు సమ్మక్కను తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. మూడో రోజు శుక్రవారం పూర్తి స్థాయిలో భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. నాలుగో రోజు సాయంత్రం దేవదేవతలను తిరిగి వనప్రవేశం చేయడం ద్వారా జాతర ముగుస్తుంది. వంశపారంపర్యంగా వస్తున్న ఆదివాసులే పూజారులుగా వ్యవహరించడం, సంపూర్ణంగా ఆదివాసీ సంప్రదాయాల ప్రకారమే జాతర నిర్వహించడం ఈ మహా జాతర ప్రత్యేకత. తమ కోర్కెలు తీర్చమని భక్తులు అమ్మవార్లకు బెల్లం (బంగారం) నైవేద్యంగా సమర్పించుకుంటూ అపార భక్తిశ్రద్ధలతో పాల్గొనడం మేడారం జాతరను మరింత విశిష్టంగా నిలబెడుతోంది.



# సమ్మక్కసారలమ్మ మహా జాతరకు భారీ ప్రభుత్వ ఏర్పాట్లు తుది దశకు చేరుకున్న సన్నాహాలు

**హైద్రాబాద్, 17 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**




ములుగు జిల్లాలోని మేడారంలో జరగనున్న సమ్మక్కసారలమ్మ మహా జాతర2026ను ఘనంగా, సురక్షితంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. కోట్లాది భక్తులు తల్లుల దర్శనానికి తరలివచ్చే ఈ మహా పర్వంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఏర్పాట్లు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు మేడారంలోనే బస చేస్తూ క్షేత్రస్థాయిలో ప్రతి విభాగం పనితీరును నిత్యం సమీక్షిస్తూ పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు సులభ దర్శనం, భద్రత, సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా కార్యాచరణ కొనసాగుతోంది. ఈసారి సుమారు మూడు కోట్ల మంది భక్తులు తరలివస్తారనే అంచనాతో అన్ని ఏర్పాట్లను విస్తృతంగా రూపొందించారు. ఈ మహా జాతర నిర్వహణ కోసం మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. వీరికి తోడుగా 2,000 మంది ఆదివాసీ యువత వాలంటీర్లుగా సేవలందించనున్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలగకుండా 27 శాశ్వత మొబైల్ టవర్లతో పాటు తాత్కాలికంగా 33 మొబైల్ టవర్లు, 450 విహెచ్‌ఎఫ్ సెట్లు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు మేడారం ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లు, 42 సెక్టర్లుగా విభజించి, ప్రతి జోన్‌కు జిల్లా స్థాయి అధికారి, ప్రతి సెక్టార్‌కు మండల స్థాయి అధికారి బాధ్యతలు అప్పగించారు. ఆలయ ప్రాంగణం, గద్దెలు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, ఊరట్టం, శివరాం సాగర్, నర్లాపూర్, పడిగాపూర్ వంటి కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములు, మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, అత్యవసర స్పందన బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా 525 ప్రాంతాల్లో రహదారి సమస్యలను గుర్తించి పరిష్కరించారు. కొత్త రోడ్లు, మరమ్మత్తులు, కల్వర్టుల నిర్మాణంతో రవాణా వ్యవస్థను బలోపేతం చేశారు. వాహనాల రద్దీని తగ్గించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 1,418 ఎకరాల విస్తీర్ణంలో 42 పార్కింగ్ ప్రాంతాలను సిద్ధం చేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా నిరంతర నీటి సరఫరా కల్పిస్తూ, 5,482 తాగునీటి నల్లాలు ఏర్పాటు చేశారు. జంపన్నవాగులో పవిత్ర స్నానాలు చేసే భక్తుల కోసం 119 డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేసి, నీటి పరిశుభ్రత కోసం క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నారు. పారిశుధ్య నిర్వహణకు 285 బ్లాకుల్లో 5,700 టాయిలెట్లు సిద్ధం చేయగా, అదనంగా మొబైల్ టాయిలెట్లు అందుబాటులోకి తెస్తున్నారు. ఇందుకోసం 5,000 మంది పారిశుధ్య సిబ్బంది, 150 ట్యాంకర్లు, 100 ట్రాక్టర్లు, 18 స్వీపింగ్ మెషిన్లు, 12 జేసీబీలు, 40 స్వచ్ఛ ఆటోలు, 16 డోజర్లు రంగంలోకి దిగాయి. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా టీజీఎన్‌పీడీసీఎల్ ద్వారా 196 ట్రాన్స్‌ఫార్మర్లు, 911 విద్యుత్ స్తంభాలు, 65.75 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి, 350 మంది సిబ్బందిని విధుల్లో నియమించారు. ప్రధాన మార్గాలు, ఆలయ పరిసరాలు, పార్కింగ్ ప్రాంతాల్లో వేల సంఖ్యలో హై పవర్ లైట్లు ఏర్పాటు చేయగా, అత్యవసర పరిస్థితుల కోసం 28 డీజిల్ జనరేటర్లు బ్యాకప్‌గా సిద్ధంగా ఉన్నాయి. రవాణా సౌకర్యాల పరంగా టీజీఎస్‌ఆర్టీసీ 4,000 బస్సులను వినియోగంలోకి తెచ్చి మొత్తం 51,000 ట్రిప్పులు నిర్వహిస్తోంది. ప్రత్యేక బస్టాండ్లు, ప్రత్యేక రూట్లతో పాటు గంటకు 15 బస్సులు నడిచేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం 10,441 మంది ఆర్టీసీ సిబ్బంది సేవలందిస్తున్నారు. ఆరోగ్య సేవల కోసం 5,192 మంది వైద్య సిబ్బందిని నియమించి, 30 అంబులెన్సులు, 40 బైక్ అంబులెన్సులు, 50 పడకల ప్రధాన ఆసుపత్రి, రోజుకు 30 మెడికల్ క్యాంపులు అందుబాటులో ఉంచారు. జంపన్నవాగులో ప్రమాదాలను నివారించేందుకు 210 మంది గజ ఈతగాళ్లు, 12 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది, 100 ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉంటాయి. అగ్నిప్రమాదాల నివారణకు 15 ఫైర్ బ్రిగేడ్ వాహనాలు, 268 మంది ఫైర్ ఫైటర్లు సిద్ధంగా ఉన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో పార్కింగ్, రహదారులతో పాటు పర్యావరణ సంరక్షణ చర్యలు చేపడుతుండగా, ఐటీడీఏ ద్వారా గిరిజనులకు కొబ్బరి కాయలు, బెల్లం, ఇతర వ్యాపారాల కోసం లైసెన్సులు జారీ చేసి ఉపాధి కల్పిస్తున్నారు. ప్రపంచ స్థాయిలో మేడారం మహా జాతర2026ను నిర్వహించాలనే లక్ష్యంతో అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో త్వరిత దర్శనం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది.

**అత్యాధునిక వసతులతో మీడియా సెంటర్..**

మేడారం మహా జాతర విశేషాలను దేశ, విదేశీ భక్తులకు తక్షణమే చేరవేయడానికి అమ్మవార్ల గద్దెల సమీపంలోని టీటీడీ కళ్యాణ మండపంలో జర్నలిస్టుల కోసం ప్రత్యేక మీడియా సెంటర్ ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచే ఫోటోలు, వీడియోలు, వార్తలను నేరుగా ప్రసారం చేసుకునే ఏర్పాట్లు చేశారు. మీడియా సెంటర్‌లో 100+100 ఎంబిపిఎస్ సామర్థ్యంతో ఇంటర్నెట్, 20 హై కాన్ఫిగరేషన్ కంప్యూటర్లు, జిరాక్స్, ఫ్యాక్స్, ప్రింటర్లు, ల్యాండ్ ఫోన్‌తో పాటు పాత్రికేయులకు భోజన, విశ్రాంతి సౌకర్యాలు కల్పించారు. మొత్తంగా, సమ్మక్కసారలమ్మ మహా జాతర2026ను భక్తుల కోసం సురక్షితంగా, సౌకర్యవంతంగా, వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలోనే ఉండి ప్రతి విభాగం పనితీరును సమీక్షిస్తూ అప్రమత్తంగా పనిచేస్తోంది.

## భీమారంలో ఫాదర్ కొలంబో వైద్య కళాశాల, మెడికేర్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

**భీమారం, 17 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**



భీమారం గ్రామ ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ రోజు గ్రామ చర్చి ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పరిశుద్ధాత్మ దేవాలయం, భీమారం వద్ద ఉదయం 10 గంటల నుండి ఈ వైద్య శిబిరం ప్రారంభమైంది. ఫాదర్ కొలంబో వైద్య కళాశాల, మెడికేర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఈ మెడికల్ క్యాంప్ నిర్వహించబడుతోంది. శిబిరానికి అనుభవజ్ఞులైన వైద్యులు హాజరై వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని గ్రామంలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కుల, మత భేదం లేకుండా గ్రామ ప్రజలందరూ హాజరై వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకొని వెళ్లవచ్చని తెలిపారు. గ్రామ స్థాయిలో ఇలాంటి ఉచిత వైద్య సేవలు అందించడం వల్ల ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెరుగుతుందని, ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.

# ప్రజలకు దగ్గరగా న్యాయసేవలు అందించడమే నా ప్రధాన లక్ష్యం

**వర్ధన్నపేటలో త్వరలో మున్సిఫ్ కోర్టు తాత్కాలిక భవన పరిశీలన పూర్తి..**
**న్యాయ సేవలు సులభతరం చేయడంలో మరో ముందడుగు వర్ధన్నపేటలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు..**
**దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే న్యాయం....**
**వర్ధన్నపేట అభివృద్ధిలో కీలక మైలురాయి మున్సిఫ్ కోర్టు ఏర్పాటు..**
**వర్ధన్నపేట పాత మున్సిపాలిటీ భవనాన్ని పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ,ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు..**

**వర్ధన్నపేట : (జై భీమ్ న్యూస్)**

వర్ధన్నపేట పట్టణంలోని పాత మున్సిపాలిటీ భవనాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శనివారం పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేసిన మున్సిఫ్ కోర్టును తాత్కాలికంగా ఈ భవనంలో ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు న్యాయ సేవలు మరింత సులభంగా, సకాలంలో అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్న చిన్న న్యాయ సమస్యల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే న్యాయం పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.న్యాయ వ్యవస్థ ప్రజలకు మరింత దగ్గర కావడం ప్రజాస్వామ్యానికి బలమని, మున్సిఫ్ కోర్టు ఏర్పాటు వర్ధన్నపేట ప్రాంత అభివృద్ధిలో మరో కీలక ముందడుగుగా నిలుస్తుందన్నారు.ఈ ప్రక్రియకు సహకరించిన జిల్లా న్యాయ విభాగ అధికారులు, సంబంధిత ప్రభుత్వ అధికారులకు ఎమ్మెల్యే నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, టౌన్ పార్టీ అధ్యక్షుడు మైస సురేష్, కాంగ్రెస్ నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుధీర్, పోలీస్ ఏసీపీ నర్సయ్య, ఎస్సై సాయిబాబా తో పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# హసన్‌పర్తిజయగిరి రైల్వే గేటు వద్ద ట్రైన్ మోరాయింపు వాహనదారులకు తీవ్ర అవస్థలు

**గంటలుగా గేటు ఓపెన్ చేయక ప్రజలు నానా అవస్థలు**
**- ఆర్ఓబి నిర్మించాలని డిమాండ్**

**హసన్ పర్తి, 17 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి నుంచి జయగిరి రైల్వే గేటు మార్గంలో ట్రైన్ మోరాయించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైల్వే గేటు గంటల తరబడి మూసివుండటంతో రెండు వైపులా వాహనాలు బారులు తీరాయి. దీంతో ఈ ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి, ప్రయాణికులు గేటు వద్దనే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అత్యవసర పనుల నిమిత్తం వెళ్లే వారు, పాఠశాలలుకళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ప్రత్యామ్నాయ మార్గాలు లేక కొందరు ప్రయాణికులు మధ్యలోనే నిలిచిపోగా, మరికొందరు పని ప్రదేశాలకు ఆలస్యంగా చేరుకున్నారు. రద్దీ సమయాల్లో రైల్వే గేటు మూసివుండటం వల్ల స్థానికుల నిత్యజీవితం పూర్తిగా అస్తవ్యస్తమవుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య ప్రతిరోజూ జరుగుతున్న తంతేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో వరుసగా ట్రైన్లు వెళ్లడంతో రహదారి పూర్తిగా స్థంభించి, వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా అంబులెన్సులు, స్కూల్ బస్సులు, అత్యవసర సేవలకు సంబంధించిన వాహనాలు కూడా రైల్వే గేటు వద్దనే నిలిచిపోవాల్సి వస్తోందని వారు పేర్కొన్నారు. ఈ పరిస్థితి ప్రాణాపాయ స్థాయికి దారితీయవచ్చని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై భారతీయ రైల్వేతో పాటు సంబంధిత రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీస్ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. గేటు మూసే సమయాలను ముందుగానే ప్రజలకు తెలియజేసే విధంగా సూచన బోర్డులు, సమాచార వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. అలాగే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రైల్వే ఓవర్‌బ్రిడ్జి (=ాదీ) లేదా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ప్రజల నిత్యజీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఈ సమస్యపై సంబంధిత అధికారులు త్వరితగతిన నిర్ణయం తీసుకుని వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



# చైనా 'కృత్రిమ సూర్యుడు' ప్రపంచానికి వణుకు! భౌతిక శాస్త్ర సూత్రాలే మారిపోనున్నాయా?

**చైనా, 17 జనవరి 2026 (జై భీమ్ న్యూస్ చైనా):**

చైనా శాస్త్రవేత్తలు మరోసారి ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తూ అణు సంలీన పరిశోధనలో కీలక మైలురాయిని అధిగమించారు. 'ఈస్ట్' (EAST EIperimental Advanced Superconducting Tokamak)గా పిలవబడే అణు సంలీన రియాక్టర్ ద్వారా సాధించిన తాజా విజయం శాస్త్ర ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. సాధారణ భాషలో దీనిని 'కృత్రిమ సూర్యుడు'గా వ్యవహరిస్తున్నారు. సూర్యుడు, నక్షత్రాల కేంద్రంలో సహజంగా జరిగే న్యూక్లియర్ ఫ్యూషన్ ప్రక్రియను భూమిపై కృత్రిమంగా సృష్టించడమే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ లక్ష్యం కావడం విశేషం. తాజా ప్రయోగంలో, 2026 జనవరి 20న ఈస్ట్ రియాక్టర్ ప్లాస్మా స్థితిలో ఏకంగా 1066 సెకన్ల పాటు, అంటే సుమారు 17 నిమిషాల పాటు నిరంతరంగా పనిచేసి సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పింది. గతంలో 403 సెకన్లపాటు మాత్రమే కొనసాగిన ఈ ప్రయోగం, ఇప్పుడు ఆ రికార్డును రెట్టింపు కంటే ఎక్కువగా అధిగమించడం శాస్త్రవేత్తలను ఉత్సాహపరిచింది. ఇప్పటికే 2023లోనూ ఇలాంటి ప్రయోగాలు జరిగినప్పటికీ, తాజా ఫలితాలు చైనాను అణు సంలీన పరిశోధనలో ప్రపంచ ముందువరుసలో నిలబెట్టాయని నిపుణులు పేర్కొంటున్నారు. అసలు ఈ 'కృత్రిమ సూర్యుడు' అనేది సూర్యుని కేంద్రంలో జరిగే అణు సంలీన ప్రక్రియను అనుకరించే యంత్రం. గ్యాస్ అణువులు అత్యంత అధిక ఉష్ణోగ్రతలకు గురైనప్పుడు ఎలక్ట్రాన్లను కోల్పోయి అయాన్లుగా మారుతాయి. ఈ స్థితినే 'ప్లాస్మా'గా పిలుస్తారు. ఈస్ట్ రియాక్టర్‌లో సూర్యుడి కంటే ఎక్కువగా, సుమారు 150 మిలియన్ డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను నియంత్రితంగా నిలబెట్టగలగడం ఈ ప్రయోగం ప్రత్యేకత. ఇలా చేయడం ద్వారా భవిష్యత్తులో అపరిమితమైన, కార్బన్ ఉద్గారాలు లేని స్వచ్ఛమైన శక్తిని ఉత్పత్తి చేయవచ్చన్న ఆశలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ విజయం ఆశలతో పాటు ఆందోళనలను కూడా రేకెత్తిస్తోంది. ఇంత భారీ స్థాయిలో ఉష్ణోగ్రతలను ఉత్పత్తి చేయడం వల్ల భూ వాతావరణంపై ఎలాంటి ప్రభావాలు ఉంటాయన్న ప్రశ్నలు కొందరు నిపుణులు లేవనెత్తుతున్నారు. భద్రతాపరంగా ఈ ప్రాజెక్ట్ పూర్తిగా సురక్షితమేనని చైనా ప్రకటిస్తున్నప్పటికీ, ఇతర అగ్రరాజ్యాలు దీనిని ఎలా స్వీకరిస్తాయన్నది చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ సాంకేతిక లోపాలు లేదా మానవ తప్పిదాలు చోటు చేసుకుంటే, అవి భారీ విధ్వంసానికి దారితీయవచ్చన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. మొత్తానికి, చైనా సాధించిన 'కృత్రిమ సూర్యుడు' విజయం శక్తి రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందా, లేక కొత్త సవాళ్లను ప్రపంచం ముందుంచుతుందా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.



# రాత్రి భర్తతో గొడవపడి గదిలోకి వెళ్లిన భార్య

**తెల్లారి చూస్తే తల్లీబిడ్డలు మృతి**
**ఆంధ్రప్రదేశ్ లోన నంద్యాలలో విషాదం**
**ఇద్దరు పిల్లలను చంపి ఉరేసుకున్న మహిళ**
**భర్తను ప్రశ్నిస్తున్న పోలీసులు**

**నంద్యాల, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాలలో విషాదం చోటుచేసుకుంది. భర్తతో గొడవపడిన ఓ మహిళ ఇద్దరు పిల్లలను చంపి ఆత్మహత్యకు పాల్పడింది. ఎన్జీవో కాలనీలో ఈ విషాదకర సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాలలోని లలితా నగర్ కు చెందిన ఉదయ్ కిరణ్ కు, ఎన్జీవో కాలనీకి చెందిన మల్లికకు ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఇషాన్ సాయి(2), పరిమిత(7 నెలలు) ఉన్నారు. కొంతకాలంగా ఉదయ్, మల్లికల మధ్య గొడవలు జరుగుతున్నాయి. నిన్న (శుక్రవారం) రాత్రి కూడా గొడవ జరగడంతో మనస్థాపం చెందిన మల్లిక పిల్లలను తీసుకుని గదిలోకి వెళ్లి తలుపులు బిగించుకుంది. ఏడుస్తూ పడుకుని ఉంటుందని ఉదయ్ కిరణ్ పట్టించుకోలేదు. తెల్లవారినా తలుపులు తెరవకపోవడంతో గది తలుపులు బద్దలు కొట్టి చూడగా.. మల్లికతో పాటు పిల్లలు ఇద్దరూ విగత జీవులుగా పడి ఉన్నారు. పిల్లలను చంపి మల్లిక ఉరి వేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మల్లిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఉదయ్ కిరణ్ ను విచారిస్తున్నట్లు సమాచారం.

# చదువుపై నిరుత్సాహంతో యువకుడి ఆత్మహత్య

**జయగిరిలో కలకలం ఐటీఐ విద్యార్థి మృతి**

**వరంగల్, 17 జనవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలో చోటుచేసుకున్న విషాదకర ఘటన స్థానికంగా తీవ్ర కలకలాన్ని రేపింది. చదువుపై నిరుత్సాహం, భవిష్యత్తుపై అయోమయం కారణంగా ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆలేటి రమేష్ (38) కుమారుడు ఆలేటి విశేష్ (17) ఈ ఘటనలో మృతి చెందాడు. విశేష్ ఇటీవలే 10వ తరగతి పూర్తి చేశాడు. కుటుంబ సభ్యుల ఆశయాలతో అతడిని ఇంటర్మీడియట్ చదువు కోసం హాస్టల్‌లో చేర్పించగా, అక్కడ ఉండి చదవడం ఇష్టం లేక ఇంటికి తిరిగి వచ్చేశాడు. అనంతరం ములుగు రోడ్డులోని కోర్ట్ ఐటీఐలో చేర్పించినప్పటికీ, అక్కడ కూడా కళాశాలకు సరిగా వెళ్లకుండా స్నేహితులతో తిరుగుతూ చదువుపై నిర్లక్ష్యం చూపుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై తండ్రి ఇటీవల అతడిని మందలించి చదువుపై దృష్టి పెట్టాలని సూచించినట్లు సమాచారం. ఈ నెల 16న సాయంత్రం తండ్రి పనిమీద బయటకు వెళ్లిన సమయంలో, అదే రోజు రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో ఇంటి వెనుకభాగంలో విశేష్ అపస్మారక స్థితిలో కనిపించాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న బంధువులు, గ్రామస్థులు అక్కడికి చేరుకుని ఘటనపై విచారం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ప్రాథమిక విచారణలో చదువుపై ఒత్తిడి, నిరుత్సాహమే ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులు కూడా ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయలేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో జయగిరి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. యువకులపై చదువు, భవిష్యత్తు ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం సమన్వయంతో ముందుచూపుతో వ్యవహరించాలని గ్రామ పెద్దలు అభిప్రాయపడుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేయండి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హన్మకొండ, 17 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అదనపు కలెక్టర్ రవి తో కలిసి, హనుమకొండ జిల్లా పరిధిలోని మండలాలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, పరకాల మున్సిపల్ పరిధిలో చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా మండలాలు, మున్సిపల్ పరిధిలో తుది దశకు చేరుకున్న ఇండ్లు ఎన్ని, ఇంకా ఏయే దశల్లో ఉన్నాయో, మార్క్‌అవుట్ కాని ఇండ్లను ఎప్పుడు ప్రారంభిస్తారు, అలాగే ఎస్బీఎం, వీబీజీ రామ్ జీ (ఉపాధి హామీ) పథకాల అమలుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి బిల్లుల చెల్లింపులు వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రతి వారం పనుల పురోగతి కనీసం 30 శాతం ఉండాలని, మార్క్‌అవుట్ చేయని ఇండ్లను వెంటనే మార్క్‌అవుట్ చేయాలని ఆదేశించారు. మంజూరై పనులు ప్రారంభం కాని ఇండ్లను ఈ నెల 31వ తేదీలోగా తప్పనిసరిగా ప్రారంభించాలన్నారు. గడువు పొడిగింపు లేదని, పనులు ప్రారంభించని పక్షంలో రద్దు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఎల్3 జాబితాలో అర్హులైన లబ్ధిదారులు ఉంటే పరిశీలించాలని, మొంథా తుపాన్ కారణంగా పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లకు ప్రత్యామ్నాయంగా కొత్త ఇండ్లు కేటాయించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్లు, రెండుపడక గదుల ఇళ్ల బిల్లుల అంశాలపై గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్దార్థ నాయక్ వివరించగా, ఎస్బీఎం, వీబీజీ రామ్ జీ పనుల పురోగతిని డీఆర్డీఏ మేనేజర్ శ్రీను వివరించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డీఈ రవీందర్, కాజీపేట డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఎంపీడీవోలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులపై తప్పుడు ఆరోపణలు నిందితులపై కఠిన చర్యలు: చిట్యాల సి.ఐ. హెచ్చరిక

**చిట్యాల, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**




అక్రమ కార్యకలాపాల్లో పట్టుబడి, తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. మల్లేష్ స్పష్టం చేశారు. గత ఏడాది నవంబర్ చివరి వారంలో చిట్యాలలోని శివాజీ విగ్రహం వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్‌సైకిల్‌పై వచ్చిన మోత్కూరు నరేష్‌ను ఆపి బ్రీత్ అనలైజర్ పరీక్ష చేయగా 473 రీడింగ్ నమోదు కావడంతో అతడు తీవ్ర మద్యం మత్తులో ఉన్నట్లు నిర్ధారణ అయింది. వాహన తనిఖీలో 5 లీటర్ల గుడుంబా లభ్యమైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా గుడుంబా తరలించడం మరియు మద్యం మత్తులో వాహనం నడిపినందుకు గాను సీఆర్ పల్లికి చెందిన మోత్కూరు నరేష్‌తో పాటు సాదా రాములుపై చర్యలు తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. అయితే జనవరి 16న నిందితుడు అంబేద్కర్ విగ్రహం వద్ద పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, తన వాహనాన్ని కావాలనే ఇవ్వడం లేదని తప్పుడు ఆరోపణలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారాన్ని కొంతమంది వ్యక్తులు రాజకీయ స్వలాభం కోసం మలచి, పోలీసులకు రాజకీయ నాయకులతో సంబంధాలు ఉన్నట్లు ప్రచారం చేయడాన్ని సి.ఐ. తీవ్రంగా ఖండించారు. పోలీసు శాఖ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించే వారిపై న్యాయ సలహా తీసుకుని మరింత కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులను రాజకీయాల్లోకి లాగడం సహించబోమని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారికి ప్రజలు సహకరించవద్దని సి.ఐ. డి. మల్లేష్ విజ్ఞప్తి చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem




# అందరికీ అన్నీ తినే అదృష్టం ఉండదు: చిరంజీవి

**బ్లాక్ బస్టర్ దిశగా 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా**
**చిరంజీవి, వెంకటేశ్, అనిల్ రావిపూడి, సాహు, సుష్మితలతో చిత్ర యూనిట్ స్పెషల్ ఇంటర్వ్యూ**
**తన చేతులతో వండిన వంటకాలను వడ్డించిన చిరంజీవి**

మెగాస్టార్ చిరంజీవి తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' సూపర్ హిట్ అయింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో చిరు సరసన నయనతార నటించగా, విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రను పోషించారు. సినిమా భారీ విజయం దిశగా దూసుకుపోతున్న తరుణంలో చిత్ర యూనిట్ ఓ ఇంటర్వ్యూ చేసింది. ఈ ఇంటర్వ్యూలో చిరంజీవి, వెంకటేశ్, అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు, సుస్మిత పాల్గొన్నారు. ఈ ఇంటర్వ్యూ ఎంతో సరదాగా సాగింది. ఇంటర్వ్యూ కొనసాగుతున్న సమయంలో ఓ సందర్భంలో చిరంజీవి తన చేతులతో వండిన కొన్ని వంటకాలను అందరికీ వడ్డించారు. ఈ సందర్భంగా చిరంజీవిని కూడా తినాలని వెంకటేశ్ కోరగా... ఆయన తిననని చెప్పారు. దీంతో.. డైట్ చేస్తున్నావని, సన్నగా అయిపోయి సినిమాలో తనను డామినేట్ చేశావని సరదాగా వెంకీ వ్యాఖ్యానించారు. దీనికి సమాధానంగా... పొట్టకూటి కోసం పొట్ట మాడ్చుకుంటున్నానని చిరు చమత్కరించారు. అందరికీ అన్నీ తినే అదృష్టం ఉండదని చెప్పారు. దీంతో, అక్కడ నవ్వులు విరబూశాయి.

# ప్రభాస్ 'స్పిరిట్' రిలీజ్ డేట్ వచ్చేసింది!

**ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా 'స్పిరిట్' విడుదల తేదీ ఖరారు**
**2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న చిత్రం**
**టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న మూవీ**
**హైఓల్టేజ్ కాప్ యాక్షన్ డ్రామాగా రానున్న 'స్పిరిట్'**
**ఈ చిత్రంలో పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా ప్రభాస్**




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'స్పిరిట్' విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటనతో ప్రభాస్ అభిమానుల ఎదురుచూపులకు తెరపడింది. ఈ సినిమాను టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ పతాకాలపై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. హీరో ప్రభాస్, చిత్ర నిర్మాణ సంస్థలు, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఈ రిలీజ్ డేట్‌ను పంచుకున్నారు. 'స్పిరిట్' ఒక హైఓల్టేజ్ కాప్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇందులో ప్రభాస్ ఒక శక్తివంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. 'యానిమల్' బ్యూటీ తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీతో పాటు మొత్తం తొమ్మిది భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్‌ల తర్వాత సందీప్ వంగా దర్శకత్వంలో వస్తున్న సినిమా కావడంతో 'స్పిరిట్'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.



# సౌత్ స్టార్ హీరో నన్ను అవమానించాడు: తమన్నా

తెలుగు చిత్ర పరిశ్రమలో మిల్కీ బ్యూటీ తమన్నా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దాదాపు పదిహేను సంవత్సరాలకు పైగా హీరోయిన్‌గా కొనసాగుతూ, టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. కథానాయికగా మాత్రమే కాకుండా, ఐటెం సాంగ్స్‌లోనూ తనదైన స్టైల్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమన్నా తన కెరీర్‌లో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని బయటపెట్టింది. ఒక సినిమా షూటింగ్ సమయంలో తనను ఓ బోల్డ్ సీన్ చేయమని అడిగారని, అందులో ఇంటిమసీ ఎక్కువగా ఉండటంతో తాను అసౌకర్యంగా భావించి నిరాకరించినట్లు చెప్పింది. ఆ విషయం సదరు సౌత్ స్టార్ హీరోకు నచ్చలేదని, సెట్‌లో అందరి ముందే తనపై అరిచి, హీరోయిన్‌ను మార్చేయాలని పేర్కొంటూ, అవమానించాడని తెలిపింది. ఆ సమయంలో తనకు తీవ్రంగా బాధ కలిగిందని తమన్నా వెల్లడించింది. అయితే ఆ హీరో తర్వాత తన వద్దకు వచ్చి క్షమాపణలు చెప్పినట్లు కూడా తెలిపింది. అయినా, ఆ హీరో ఎవరో మాత్రం చెప్పకపోవడంతో అభిమానుల్లో ఆసక్తి, చర్చ మొదలయ్యాయి.